గురువారం
18-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 206
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా, ద.కొరియా, జపాన్ నావికా విన్యాసాలు

సియోల్: ఉత్తర కొరియాతో ఉద్రిక్తతల వేళ అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ సంయుక్తంగా నావికా దళ విన్యాసాలు చేపట్టాయి. జేజు ద్వీపం సమీప జలాల్లో యుద్ధ విన్యాసాలను ప్రదర్శించాయి. కవ్వింపులకు పాల్పడితే నాశనం చేస్తామని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ హెచ్చరికలకు దీటైన బదులు ఇచ్చే విధంగా సైనిక విన్యాసాలను మూడు రోజుల పాటు నిర్వహించాయి. ఇవి బుధవారంతో ముగిశాయి. తొమ్మిది యుద్ధ నౌకలు, అమెరికా ఎయిర్‌క్రాఫ్ట్ కేరియర్ 'కారల్ విన్సన్', దక్షిణ కొరియా, జపాన్‌కు చెందిన ఎయిగిస్ డిస్ట్రాయర్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి.

25న బ్యాంకుల సమ్మె

ఖాళీల భర్తీ, ఉద్యోగుల క్రమబద్ధీకరణకు డిమాండ్

న్యూఢిల్లీ: బ్యాంకుల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం డిమాండ్ చేస్తూ ఈనెల 25న దేశవ్యాప్త సమ్మెకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) ఉద్యోగులు సిద్ధమయ్యారు. ఈనెల 20, 24వ తేదీల్లోనూ తమ డిమాండ్ల సాధన కోసం ప్రాంతీయ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయనున్నారు. 24న నల్ల

- మిగతా 2 లో

ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్

సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె సహా వివిధ రంగాల వారీగా సమ్మెలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ) ఐక్యంగా పిలుపునిచ్చాయి. ప్రజల మౌలిక సమస్యలను తప్పుదారి పట్టించి, కార్పొరేట్ శక్తులతో సంబంధాలు కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2 లో

కేఆర్‌ఎంబీకి సాగర్ నిర్వహణ

- ఏపీ, తెలంగాణ అధికారులతో కేంద్ర జలశక్తి సమావేశం
- చర్చించాక నిర్ణయం చెబుతామన్న అధికారులు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగు నీటితో పాటు విద్యుత్ అవసరాలు తీర్చే అత్యంత కీలకమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణ ఇకపై కృష్ణా నది యాజమాన్య బోర్డు చేతుల్లోకి వెళ్లనుంది. ఇటీవల సాగర్ డ్యామ్‌పై రెండు ప్రభుత్వాల మధ్య నెలకొన్న ఉద్రిక్త ఘటనలను పురస్కరించుకొని కేంద్ర జలశక్తి కేఆర్‌ఎంబీకి

- మిగతా 2 లో

జగన్ చెంతకు ఎమ్మెల్యేల క్యూ

- నాలుగో జాబితా కసరత్తు షురూ
- అధినేతతో బాలినేని భేటీ
- ఒంగోలు, నరసరావుపేటపై ఎడతెగని చర్చలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జ్‌ల నాలుగో జాబితాపై వైసీపీ అధినేత, సీఎం జగన్ ముమ్మర కసరత్తు చేస్తున్నారు. మూడు జాబితాల్లో 24 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు నిరాకరించడంతో నాలుగో లిస్టులో ఇంకెంత మంది టికెట్లు గల్లంతవుతాయోనని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ఇన్‌ఛార్జుల మార్పులు, చేర్పులపై జగన్ దృష్టి సారించడంతో బుధవారం క్యాంపు కార్యాలయానికి మళ్లీ ఎమ్మెల్యేలు, నేతల తాకిడి మొదలైంది. నరసారావుపేట, ఒంగోలు ఎంపీ ఇన్‌చార్జుల ఎంపిక అధిష్టానానికి పెద్ద సమస్యగా మారింది. గుంటూరుకు నరసారావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పేరు సూచించినప్పటికీ ఆయన ఆసక్తిగా లేరు. ఆయనతోపాటు నరసారావుపేట పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు నిరాకరిస్తున్నారు. తమకు శ్రీకృష్ణదేవరాయలే ఉండాలని ఇటీవల సీఎం దగ్గర ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తంచేశారు. అటు ఒంగోలు ఎంపీ స్థానంపైనా గదరగోళం నెలకొంది. క్యాంపు కార్యాలయానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, నరసారావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు వచ్చారు. తొలుత వారితో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి చర్చించారు. అవసరమైన వారిని సీఎం దగ్గరకు పంపుతున్నారు. సీఎం కార్యాలయానికి వచ్చిన బాలినేని శ్రీనివాస్‌రెడ్డి నేరుగా సీఎం జగన్‌తో భేటీ అయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇస్తేనే తాను ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఇప్పటికే సీఎంకు బాలినేని తేల్చిచెప్పిన విషయం విదితమే. దీనిపై ఇప్పటికే రెండు, మూడు సార్లుగా సీఎంఓ దగ్గరకు బాలినేని వచ్చి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే మాగుంటకు సీటు

- మిగతా 2 లో

చంద్రబాబు బెయిల్‌పై సుప్రీంలో విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఫైబర్ నెట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోసారి వాయిదా పడింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం విచారణ చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనం వద్ద కేసు గురించి ప్రస్తావించారు. దీనిపై స్పందించిన జస్టిస్ అనిరుద్ధ బోస్... ఈరోజు బెంచ్ కూర్చోవడం లేదని తెలిపారు. విచారణకు మరో తేదీ ఇస్తామని వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్ తర్వాత, ఆయనపై ఫైబర్‌నెట్ కేసు నమోదైంది. ఫైబర్ నెట్ కేసులోని అంశాలు 17-ఏ సెక్షన్‌తో ముడిపడి ఉన్నందున ధర్మాసనం గతంలో ఈ కేసును వాయిదా వేసింది. అప్పటివరకు చంద్రబాబుపై తదుపరి చర్యలు తీసుకోవద్దంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. అయితే మంగళవారం సెక్షన్ 17-ఏపై ధర్మాసనం భిన్న తీర్పులు వెలువరించిన నేపథ్యంలో ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు వస్తాయన్న అంశంపై టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

విజయవాడలో 125 అడుగుల

అంబేద్కర్ విగ్రహం

- 19 ఎకరాల్లో స్మృతివనం అభివృద్ధి
- సీఎం జగన్ చేతుల మీదుగా రేపు ఆవిష్కరణ
- భారీగా తరలి రావాలని పిలుపు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: విజయవాడ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహంతో పాటు స్మృతివనం ప్రాజెక్టు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విగ్రహావిష్కరణ చేయనున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న స్వరాజ్య మైదానంలో సుమారు 19 ఎకరాల సువిశాల స్థలంలో దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రారంభించింది. దీని ప్రారంభ ముహూర్తాలు తరచూ వాయిదా పడుతూ వస్తున్నప్పటికీ, త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి అధికారులు ప్రారంభానికి సిద్ధం చేశారు. ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండంగా అంబేద్కర్ స్మృతి వనాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో... ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ప్రతి ఒక్కరినీ ఆకర్షించే విధంగా ఈ స్మృతివనంలో అంబేద్కర్ విగ్రహంతో పాటు అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్‌లు, లైబ్రరీ వంటి వాటితో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విగ్రహం పొడవు మొత్తం 125 అడుగులు కాగా, పెడస్టల్ (దిమ్మ)తో కలిపి విగ్రహం 205 అడుగుల ఎత్తు ఉంటుంది. దీని తయారీని షూ దగ్గర నుంచి బెల్టు వరకు హనుమాన్ జంక్షన్‌కి చెందిన శిల్పి ప్రసాద్ అధ్వర్యంలో కాస్టింగ్ చేశారు. విగ్రహం కింద గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్ ఉంటాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు హాళ్లు ఉంటాయి. ఒక్కో హాలు 4వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో ఓ మినీ థియేటర్, మిగిలిన మూడు హాల్స్‌లో అంబేద్కర్ జీవిత చరిత్రను తెలిపే డిజిటల్ మ్యూజియం ఉంటుంది. ఫస్ట్ ఫ్లోర్‌లో 2,250 చదరపు అడుగుల విస్తీర్ణం కల్గిన నాలుగు హాల్స్ ఉంటాయి. ఒక హాలులో అంబేద్కర్‌కు దక్షిణ భారతదేశంతో ఉన్న అనుబంధాన్ని ప్రదర్శిస్తారు. సెకండ్ ఫ్లోర్‌లో కూడా 1000 చదరపు అడుగుల విస్తీర్ణంతో నాలుగు హాల్స్ ఉంటాయి. ఇక పర్యాటకులకు ఆహ్లాదం కల్గించే విధంగా పార్కును అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భారీ పొడవైన రెండు నెమళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన ఫౌంటెన్ అందరినీ ఆకర్షించేలా ఉంది. దాదాపు 3వేల మంది కూర్చునేలా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేశారు. సామాజిక న్యాయ మహాశిల్పం పేరును నామకరణం చేశారు. విజయవాడ నగరంలో ఇప్పటికే కనకదుర్గ అమ్మవారు, భవానీపురం ఐలాండ్, ప్రకాశం బ్యారేజీ, ఆకర్షణీయమైన నదీ తీర ప్రాంతం వంటి పర్యాటక

- మిగతా 2 లో

హృదయ విదారకం

- భార్య శవాన్ని కావడిపై మోసుకెళ్లిన భర్త
- విజయనగరం జిల్లాలో ఘటన

విశాలాంధ్ర–ఎస్‌కోట: భార్య మృతదేహాన్ని భర్త కొంతమేర బైక్‌పై, ఆ తర్వాత కావడిలో మోస్తూ స్వగ్రామానికి తరలించిన హృదయవిదారక ఘటన విజయనగరం జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ కోట మండలం చిట్టెంపాడుకి చెందిన మాదల గంగన్న, గంగమ్మలకు ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. కుమారుడు ఆకస్మికంగా అనారోగ్యానికి గురయ్యాడు. రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలిలో కుమారుడిని చిట్టెంపాడు గిరిశిఖర గ్రామం నుంచి కొండ దిగువన ఉన్న దబ్బగుంట వరకు అతికష్టం మీద తీసుకెళ్లి అక్కడ నుంచి విశాఖ ఆసుపత్రికి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సార్సార్.. ఆ పారిపోయిన కోడిని వదిలేయండి, ఇంకా మన దగ్గర నాలుగొందల కోళ్లు వున్నాయి!

జాతీయరహదారి కళకళ

- సంక్రాంతి ప్రయాణికుల తిరుగు పయనం
- మళ్లీ టోల్‌గేట్ల కిటకిట

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: తెలంగాణ ప్రాంతంలోని ఏపీ వాసులంతా తిరుగు ప్రయాణం కావడంతో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వేలాది కార్లు, బస్సులు, ఇతర వాహనాలతో కళకళలాడింది. ఈనెల 14,15,16 తేదీల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెలంగాణలోని హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో నివసించే ఏపీ వాసులు పెద్దసంఖ్యలో స్వగ్రామాలకు తరలివచ్చారు. ఒక్క హైదరాబాద్ నుంచే దాదాపు 10 లక్షల మంది వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో సంక్రాంతి పండుగ ప్రత్యేకత కోడి పందేలు. వీటిని తిలకించేందుకు, నేరుగా కోళ్లతో ఆడించేందుకు, పందేలు కాసేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తారు. వీరంతా మూడు రోజులపాటు జన్మభూమిలో గడిపి బుధవారం తిరుగు పయనమయ్యారు. దీంతో హైవే 16 వరుస కార్లతో చీమలదండును తలపించింది. బస్సులు కూడా ఏపీఎస్, తెలంగాణ ఆర్టీసీలు

- మిగతా 2 లో

పాకిస్థాన్‌పై ఇరాన్ దాడులు

మా సార్వభౌమాధికారాన్ని సవాల్ చేస్తే ఊరుకోం: పాక్ హెచ్చరిక

టెహ్రాన్/ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు జరిపినట్లు ఇరాన్ ప్రకటించింది. డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో జైష్ అల్ అదిల్ అనే ఉగ్రసంస్థకు చెందిన రెండు స్థావరాలు ధ్వంసమైనట్లు పేర్కొంది. బలూచిస్థాన్ కేంద్రంగా ఉన్న జైషే అల్ అదిల్ మిలిటెంట్లు తమ భద్రతా బలగాలపై ఇంతకు ముందు దాడి చేయడంతో, ప్రతీకార దాడులు జరిపినట్లు ఇరాన్ వెల్లడించింది. సున్నీ మిలిటెంట్ గ్రూపు 'జైష్ అల్ అదిల్' బలూచిస్థాన్ కేంద్రంగా పని చేస్తూ ఇరాన్‌లోని సిస్థాన్-బలూచిస్థాన్‌లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. అయితే ఇరాన్ దాడులను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో ఇద్దరు పిల్లలు చనిపోయారని, మరో ముగ్గురికి గాయాలయ్యాయని పేర్కొంది. ఇలాంటి చర్యలకు తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఇరాన్‌ను హెచ్చరించింది. తమ గగనతలాన్ని దుర్వినియోగిస్తూ పాక్ సార్వభౌమాధికారాన్నే ఇరాన్ సవాల్ చేసిందని దుయ్యబట్టింది. ఇరాన్ రాయబారిని పాక్ విదేశాంగ కార్యాలయం పిలిపించింది. ఇరాన్ చర్యలను ఆక్షేపిస్తూ తీవ్రస్థాయిలో నిరసనను వ్యక్తం చేసింది. పరస్పరం సమాచారం పంచుకునే మార్గాలు తమ రెండు దేశాలకు ఉండటాన్ని పాకిస్థాన్ గుర్తుచేసింది. ఇరాన్ ఇలా దాడులకు పాల్పడటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఉగ్రవాదాన్ని అన్ని దేశాలు కలిసి ఎదుర్కోవాలని పాకిస్థాన్ నొక్కిచెప్పింది. ఏకపక్ష చర్యలతో పొరుగు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బ తింటాయని ఇరాన్‌కు పాకిస్థాన్ స్పష్టంచేసింది.

ఆస్కార్ ఫిగురా వ్యతిరేక చర్యలొద్దు

- వెనిజులా ప్రభుత్వానికి కేకేఈ హెచ్చరిక
- కమ్యూనిస్టులకు సంఘీభావం

కారకస్: వెనిజులా కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా చర్యలను ఆ దేశంలోని పీఎస్‌యూవీ ప్రభుత్వం పెంచుతోంది. దీనిని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) తీవ్రంగా ఖండించింది. 2023 ఆగస్టులో వెనిజులా కమ్యూనిస్టు పార్టీ గుర్తింపును రద్దు చేసే విధంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని కేకేఈ ఓ ప్రకటన చేసింది. వెనిజులా ప్రభుత్వ దుశ్చర్యలను దుయ్యబట్టింది. వెనిజులా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ఆస్కార్ ఫిగురా లక్ష్యంగా దాడులకు ఉపకరిస్తోందని, ఆయన ఎంపీ పదవిని అన్యాయంగా లాక్కునే ప్రయత్నం చేస్తోందని, దీనిని ఉపేక్షించబోమని కేకేఈ తేల్చిచెప్పింది. వెనిజులా కమ్యూనిస్టుల జోలికి రావద్దని ఆ దేశ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. నేషనల్ అసెంబ్లీలో కామ్రేడ్ ఆస్కార్‌ను కనీసం మాట్లాడనివ్వకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని ఆరోపించింది. కమ్యూనిస్టుల వ్యతిరేక చర్యలు పెరుగుతుండటాన్ని తీవ్రంగా ఖండించింది. వెనిజులా కమ్యూనిస్టు పార్టీ, ఆస్కార్ ఫిగురాకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న సామ్రాజ్యవాద దురాక్రమణ పర్య వసానాలను ఎదుర్కొంటున్న వెనిజులా ప్రజలకు సంఘీభావం తెలిపింది.

ఈయూ, పెట్టుబడిదారీ పార్టీలను తిరస్కరించాలి

యూరోపియన్ కమ్యూనిస్టు యాక్షన్ పిలుపు

ఈయూ: యూరోపియన్ యూనియన్ (ఈయూ), పెట్టుబడిదారీ, 'గ్రీన్' దోపిడీ పార్టీలను తిరస్కరించాలని యూరోపియన్ కమ్యూనిస్టు యాక్షన్ (ఈసీఏ) పిలుపునిచ్చింది. ఇదే అంశమై ఈనెల 14న టెలీకాన్ఫరెన్స్ నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణకు అనుకూల పరిస్థితులు లేవని పేర్కొంది. కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరై తమ అనుభవాలు, సలహాలు, సూచనలు పంచుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం వృద్ధి తదితర అంశాలను చర్చించారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పార్లమెంటు సభ్యుడు కోటస్ పపాడావిస్ ప్రారంభోపన్యాసం చేశారు. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండిస్తూ పలస్తీనా ప్రజలకు సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. అమెరికా, బ్రిటన్ కలిసి యమెన్‌పై బాంబులు కురిపించడాన్ని ఆక్షేపించారు. ఎర్ర సముద్రం, పర్షియన్ గల్ఫ్‌లో వ్యూహాత్మక దాడులకు ఈ పరిస్థితులు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఆస్ట్రియా, కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీ ఫర్ పీస్ అండ్ సోషలిజం ఫిన్లాండ్, కమ్యూనిస్ట్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ ఫ్రాన్స్, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఐర్లాండ్, కమ్యూనిస్టు ఫ్రంట్ (ఇటలీ), న్యూ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది నెదర్లాండ్స్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ది వర్కర్స్ ఆఫ్ స్పెయిన్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ స్వీడెన్, స్విస్ కమ్యూనిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ టర్కీ ప్రతినిధులు హాజరయ్యారు.

హృదయ విదారకం

(మొదటిపేజీ తరువాయి)

చేర్చారు. బాబు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు మరణంతో తల్లి గంగమ్మ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించింది. భార్యను కావడి సహాయంతోనే దబ్బగుంట వరకు తీసుకెళ్లి, అక్కడ నుంచి విశాఖ ఆసుపత్రికి గంగన్న తీసుకెళ్లారు. ఆమె కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూనే మరణించారు. వారం రోజులలో భార్య, కుమారుడు మరణించడంతో గంగన్న కన్నీరు మున్నీరుగా రోదించారు. చేసేదిలేక గంగమ్మ మృతదేహాన్ని విశాఖ ఆసుపత్రి నుంచి స్వగ్రామానికి తరలించేందుకు సిద్ధమయ్యారు. ఎస్ కోట వరకు ఒక ఆటోలో భార్య మృతదేహాన్ని తీసుకెళ్లిన గంగన్న వద్ద అక్కడ నుంచి మరొక ఆటోలో దబ్బగుంట వరకు తరలించేందుకు డబ్బులు లేవు. దీంతో స్నేహితుడి బైక్ పైనే నానా అవస్థలు పడుతూ దబ్బగుంటకి మృతదేహాన్ని తరలించాడు. కావడి సహాయంతో ఎనిమిది కిలోమీటర్ల మేర రాళ్లురప్పల మధ్య అనేక అగచాట్లు పడి భార్య మృతదేహాన్ని ఇంటికి తరలించాడు. కొండపై ఉన్న స్వస్థలానికి భార్య మృతదేహాన్ని తరలించేందుకు గంగన్న పడిన కష్టాన్ని చూసిన వారికి కన్నీళ్లు ఆగలేదు. ఆయన ఒక్కడే తంటాలు పడుతూ భార్య మృతదేహాన్ని తరలిస్తుంటేగా అక్కడున్న వారంతా చూస్తూ ఉండిపోయారే తప్పా ఏ ఒక్కరూ మానవత్వంతో ఆయనకు సాయం చేయలేదు.

జగన్ చెంతకు ఎమ్మెల్యేల క్యూ

(మొదటిపేజీ తరువాయి)

లేదంటూ వైసీపీ అధిష్ఠానం ఇంతకుముందే తేల్చిచెప్పింది. దీంతోపాటు బాలినేనికి స్థానచలనం కలిగే అవకాశముంది. మాగుంట సీటు కాకుండా, మిగిలిన విషయాలపై చర్చించేందుకు రావాలంటూ సీఎంవో నుంచి బాలినేనికి పిలుపు వచ్చింది. జగనన్న కాలనీల స్థలాల పథకానికి చెందిన బిల్లుల అంశంపై సీఎంతో చర్చించేందుకు బాలినేని వచ్చినట్లు తెలిసింది. ఈనెల 25 నుంచి సీఎం జగన్ ప్రాంతీయ సమావేశాల్ని నిర్వహించనున్నారు. ఈలోగా ఇన్‌ఛార్జిల మార్పును కొలిక్కి తీసుకొచ్చేందుకు జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే మూడు విడతలుగా ఇన్‌చార్జుల జాబితాను జగన్ విడుదల చేశారు. ఈ సమయంలో ఇన్‌ఛార్జి పదవులు దక్కని వారి నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో నాలుగో విడత జాబితాపైనా అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. మార్పులు, చేర్పులు చేసే నియోజకవర్గాల ఎమ్మెల్యేలను, ఎంపీలను స్వయంగా సీఎం తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని వారితో చర్చిస్తున్నారు. నాలుగో జాబితాలో అత్యధికంగా ఎంపీ ఇన్‌ఛార్జిల పేర్లతోపాటు ఎమ్మెల్యే స్థానాలు ఉండనున్నాయి. దీంతో మరోసారి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులలో ఆందోళన నెలకొంది.

అంబేద్కర్ విగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ప్రదేశాలతో ప్రజలను ఆకర్షిస్తుండగా, అంబేద్కర్ స్మృతివనంతో విజయవాడ ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందనుంది.

ఇది స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్: సీఎం జగన్

విజయవాడ స్వరాజ్య మైదానంలో ఈనెల 19వ తేదీన జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహత్తర కార్యక్రమానికి ప్రజలందరూ తరలి రావాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం జగన్ బుధవారం రాష్ట్ర ప్రజలకు సందేశాన్ని పంపారు. 'విజయవాడలో మనందరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేద్కర్ మహాశిల్పం రాష్ట్రానికే కాదు...దేశానికే తలమానికం. ఇది 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' అని అభివర్ణించారు. ఈ విగ్రహావిష్కరణకు అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని సీఎం కోరారు. ఇది 81 అడుగుల వేదిక మీద ఏర్పాటు చేసిన 125 అడుగుల మహా శిల్పం, అంటే 206 అడుగుల ఎత్తైన విగ్రహం అని వివరించారు. ఆ మహానుభావుడి ఆకాశమంతటి వ్యక్తిత్వం, ఈ దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, మహిళా చరిత్రలు మార్చేలా, దాదాపు 100 ఏళ్ల క్రితమే ఆయన వ్యక్తం చేసిన భావాలు కలకాలం మన దేశాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయన్నారు. బాధ్యతతో, ఆయన భావాల మీద అచంచల విశ్వాసంతో, వాటిని మన నవరత్నాల్లో, అనుసరిస్తున్న ప్రభుత్వంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా 19వ తేదీన అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు. అంబేద్కర్...అణగారిన వర్గాలకు చదువులు దగ్గరగా తీసుకు వెళ్లిన మహనీయుడు అని కొనియాడారు. ఆయన అంటరానితనం మీద, ఆధిపత్య భావజాలం మీద తిరుగుబాటు చేసిన మహానుభావుడు అని పేర్కొన్నారు. ప్రతి వాడలో ఉన్న ఆయన విగ్రహం అణగారిన వర్గాలకు నిరంతరం ధైర్యాన్ని, అండని ప్రసాదించే ఓ మహా స్ఫూర్తి అని అన్నారు. దళితులతో పాటు కులాలు, మతాలకు అతీతంగా పేదలందరి జీవితాల్లో ఈ 77 సంవత్సరాల్లో వచ్చిన అనేక మార్పులకు మూలం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భావాలు అని, అందుకే ఆయన్ను ఇంతగా గౌరవించుకుంటున్నామని తెలిపారు. ఇప్పుడు మన విజయవాడలో, ఆవిష్కరిస్తున్న ఈ మహా శిల్పం మన రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోవటం మాత్రమే కాకుండా, చరిత్రను తిరగరాసేలా, మరెందరికో వందల సంవత్సరాల పాటు స్ఫూర్తి ఇస్తుందన్నారు. ఇది మన సమాజ గతిని, సమతా భావాల వైపు మరల్చటానికి, సంఘ సంస్కరణకు, పెత్తందారీ భావాలమీద తిరుగుబాటుకు, రాజ్యాధికారంలో పేదల స్థానాన్ని సుస్థిరం చేసేందుకు, నిరంతరం స్ఫూర్తి ఇస్తుందని సీఎం జగన్ ఆకాంక్షించారు.

జాతీయరహదారి కళకళ

(మొదటిపేజీ తరువాయి)

పెద్దసంఖ్యలో ప్రత్యేక సర్వీసులు నడిపాయి. రెండు రాష్ట్రాలకు సంబంధించిన దాదాపు 11వేల సర్వీసులు రోడ్డెక్కడంతో రహదారులు ఎటుచూసినా వాహనాలతో కిటకిటలాడాయి. ఈనెల 13వ తేదీ రద్దీని పురస్కరించుకుని టోల్‌గేట్లలో ఎక్కువసేపు వాహనాలు ఆగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బుధవారం తిరుగు ప్రయాణంతో టోల్‌గేట్లలో రద్దీ ఏర్పడగా, అదనపు ద్వారాల ఏర్పాటుతో ట్రాఫిక్ ఆగకుండా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రాజమండ్రి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే లారీలను సత్తుపల్లి, ఖమ్మం మీదుగా సూర్యాపేటలో హైవే 16లో కలిసే మార్గం వైపు మళ్లించారు.

21న లెనిన్ శత వర్ధంతి సభలు జరపండి

సీపీఐ శ్రేణులకు రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: సోషలిజం సాధకులు, విప్లవోద్యమ నేత వీఐ లెనిన్ శత వర్ధంతి సభలను ఈ నెల 21వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రపంచ శ్రామిక ప్రజల నాయకుడిగా పెట్టుబడిదారీ విధానాలపై అస్త్రాలు సంధించి, శ్రామిక రాజ్య స్థాపనే లక్ష్యంగా సోషలిజం కోసం లెనిన్ కృషి చేశారని తెలిపారు. కార్మిక, శ్రామికవర్గ పక్షపాతిగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం లెనిన్ చూపిన బాట నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేశంలో బడా పెట్టుబడిదారుల అనుకూల పాలన సాగుతోందన్నారు. పాలకుల వత్తాసుతో కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. విచ్చలవిడిగా శ్రమదోపిడీ జరుగుతోందని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులు హరించబడుతున్నాయని, నిర్బంధం, నిరంకుశ విధానాలు అమలవుతున్నాయని మండిపడ్డారు. ఈ తరుణంలో శ్రమశక్తిని, కార్మిక, ప్రజా హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకోసం లెనిన్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 21న వీఐ లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని అన్ని జిల్లాలలో సీపీఐ అధ్వర్యంలో జరిగే సభలలో పార్టీ శ్రేణులు, కమ్యూనిస్టు ఉద్యమాభిమానులతో పాటు కార్మికులు, శ్రామికులు, ప్రజలు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

సమగ్ర విచారణ జరపాలి: రామకృష్ణ

విజయనగరం జిల్లా చిట్టెంపాడుకు చెందిన మాదల గంగులు కుటుంబానికి తగు న్యాయం చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మరో ప్రకటనలో డిమాండ్ చేశారు. గంగులు కుటుంబానికి జరిగిన విషాదం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆరు నెలల కుమారుడికి వైద్యం అందించేందుకు ఎస్ కోట ప్రాంతీయ ఆసుపత్రికి డోలీలో తీసుకువెళ్లడం, ఆ బాలుడు 6వ తేదీన మృతి చెందడం, భార్య గంగమ్మ కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మూడు రోజుల క్రితం చనిపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఆసుపత్రి నుండి తన భార్య మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్సులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడని పేర్కొన్నారు. దిక్కుతోచని స్థితిలో ద్విచక్ర వాహనంపై, ఆ తర్వాత డోలీతో భార్య మృతదేమాన్ని ఇంటికి తీసుకెళ్లాడని, ఈ ఘటన హృదయ విదారకమన్నారు. రహదారి సౌకర్యం లేకపోవడం, సకాలంలో వైద్యం అందకపోవడం వలన తల్లీ, బిడ్డ మృతిచెందారని రామకృష్ణ విమర్శించారు. కనీసం మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు కూడా అంబులెన్స్ లేకపోవడం దుర్మార్గమని, ఇది రాష్ట్ర ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంగులు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల వేళ సబ్సిడీ ఎర

- ఆహార, ఎరువుల సబ్సిడీలకు 48 బిలియన్ డాలర్లు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్ వ్యయంలో ఇది తొమ్మిదో వంతు
- వచ్చే ఏడాదికి ఎరువుల సబ్సిడీ అంచనా 1.75 ట్రిలియన్లు

న్యూఢిల్లీ: మెప్పు రాజకీయాలు బీజేపీకి కొట్టిన పిండి. ఎప్పుడు ఎలా ఏ వర్గాన్ని ఆకర్షించాలి... ఏ విధంగా లబ్ధి పొందాలనే వ్యూహాలను బేషుగ్గా రచించుకుంటోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో దేశ ప్రజలకు సబ్సిడీ ఎర వేసింది. ఆహారం, ఎరువుల సబ్సిడీల కేటాయింపును పెంచుతోంది. కేవలం ఎన్నికలు వస్తే తప్ప సబ్సిడీలకు సముచిత కేటాయింపు చేయాలని కేంద్రానికి గుర్తుకు రాదు. అన్ని వర్గాలతో పాటు రైతాంగాన్ని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, ఎన్నికలప్పుడు వరాల జల్లు కురిపించడం కొత్తేమీ కాదు. ఈ ఏడాది మార్చి-ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మోదీ ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టబోతోంది. ఇదే ఈ ప్రభుత్వానికి చివరి బడ్జెట్ కాగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను కొత్త ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందు ద్రవ్యలోటును చూపే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ వ్యయం 45 ట్రిలియన్ రూపాయలు కాగా ఇందులో తొమ్మిదో వంతుగా ఆహారం, ఎరువుల సబ్సిడీల వ్యయం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం కోసం ఆహారం, ఎరువుల సబ్సిడీలకు సుమారు నాలుగు ట్రిలియన్లు (48 బిలియన్ డాలర్లు) కేటాయించబోతోందని అధికార వర్గాలు తెలిపినట్లు రాయిటర్స్ నివేదించింది. కాగా, 2019లో ఆహార సబ్సిడీల వ్యయం 2.2 ట్రిలియన్ రూపాయలు (26.52 బిలియన్ డాలర్లు)గా వినియోగదారు వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వశాఖ అంచనా వేసినట్లు వర్గాలు పేర్కొన్నాయి. దీనినిబట్టి అంచనా కంటే పది శాతం ఎక్కువగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 వ్యయం 24.11 బిలియన్ డాలర్లు (రూపాయల్లో రెండు ట్రిలియన్లు)గా ఉంది. రాబోయే సంవత్సరంలో ఎరువుల సబ్సిడీ 1.75 ట్రిలియన్లు (21.10 బిలియన్ డాలర్లు)గా ఉంటుందని అంచనా. 2022-23 కోసం అంచనా వేసిన రెండు ట్రిలియన్ల కంటే ఇది తక్కువ. అయితే మూడవ సారి అధికారంలోకి వస్తామన్న ధీమాతో మోదీ ప్రభుత్వం కేటాయింపులు చేస్తోంది కానీ త్వరలో ఎన్నికలకు వెళ్లే ప్రభుత్వానికి ఈ భారాన్ని తట్టుకోవడం కష్టమవుతుంది. భారత ఆర్థిక లోటు నిర్వహణకు ఆహారం, ఎరువుల సబ్సిడీలు కీలకం. ఇది ఈ ఏడాది జీడీపీలో 5.9శాతంగా ఉండాలన్నది మోదీ ప్రభుత్వ లక్ష్యం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కనీసం 50 బేసిక్ పాయింట్లు తగ్గించాలని కేంద్రం యోచిస్తోంది. ఉచిత ఆహార పథకాన్ని ఐదేళ్లు పొడిస్తూ గతేడాది మోదీ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వచ్చే ఏడాదికి ఆహార సబ్సిడీల వ్యయం పెరుగుతుంది. అయితే ఈ పథకం ద్వారా 80 కోట్ల (800 మిలియన్లు) మందికి లబ్ధి చేకూరుతున్నట్లు కేంద్రం చెప్పుకుంటోంది.

ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్

(మొదటిపేజీ తరువాయి)

అనుసరిస్తున్న జాతి వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాయి. 'సేవ్ డెమోక్రసీ, సేవ్ అవర్ నేషన్, సేవ్ ద పీపుల్' అనే నినాదాలతో ఐక్య పోరాటాలకు సిద్ధమయ్యాయి. తమతో కలిసి రావాలని లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు, పౌర సంఘాలకు ఢిల్లీలో జరిగిన ఎస్‌కేఎం, సీటీయూ సంయుక్త సమావేశం పిలుపునిచ్చింది. జనరంజకమైన ప్రభుతాన్ని ఏర్పాటు చేసుకుందామని ఉద్ఘాటించింది. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఏడాది పాటు ఉద్యమించి చరిత్ర సృష్టించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) అధ్వర్యంలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా 'గ్రామీణ బంద్' జరగబోతుంది. అన్ని గ్రామాల్లోనూ బంద్ నిర్వహించాలని రైతాంగానికి ఎస్‌కేఎం పిలుపునిచ్చింది. రైతాంగ ఉద్యమంలో అమరులైన 735 మంది రైతుల జ్ఞాపకార్థం స్మారకస్థూపం నిర్మించేందుకు స్థలం ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ, హరియాణా ముఖ్యమంత్రులకు లేఖలు పంపాలని రైతులకు సూచించింది. అదే సమయంలో వ్యవసాయం కోసం ప్రత్యామ్నాయ విధానం తీసుకురావాలని డిమాండ్ చేసింది. కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడమే గ్రామీణ బంద్ ఉద్దేశంగా ఎస్‌కేఎం ఓ ప్రకటన చేసింది. ప్రతికూల విధానాలతో రైతులను నష్టాల్లోకి నెట్టివేస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని దుయ్యబట్టింది. రైతులను సేద్యానికి దూరం చేసి... పంట ఉత్పత్తిని, ఆహార సరఫరా గొలుసులన్నీ గుత్తేదారులకు అప్పణంగా కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిందేనని తేల్చిచెప్పింది. వ్యవసాయం, వ్యవసాయాధారిత పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ విధానం కావాలని పేర్కొంది. రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తూ, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు దారాదత్తం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టలని ఎస్‌కేఎం పిలుపునిచ్చింది. ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్నవన్నీ రైతుల వ్యతిరేక విధానాలేనని, దీంతో అన్నదాతకు తీరని నష్టం జరుగుతోందని అన్నారు. ఈ విషయంలో రైతు సంఘాలన్నింటిది ఒకటే మాటగా చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పిచికారీ మందుల మార్కెట్లన్నీ బేయర్ వంటి దిగ్గజ సంస్థలు ఆక్రమించుకున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో సహకార సంఘాల ఏర్పాటు అనివార్యమని, ప్రభుత్వ సహకారంతోనే రైతు కోలుకోగలడన్నారు.

ఎస్‌కేఎంలోకి ఎస్ఎస్ఎం, బీకేయూ (రాజేవాల్)

సంయుక్త కిసాన్ మోర్చాలో బల్బీర్ సింగ్ రాజేవాల్ నేతృత్వ సంయుక్త సమాజ్ మోర్చా (ఎస్ఎస్ఎం), బీకేయూ (రాజేవాల్) చేరాయి. ఎస్‌కేఎం పంజాబ్‌తో కలిసి బీకేయూ (ఉగ్రాహన్) పనిచేస్తోంది. ఫలితంగా ఎస్‌కేఎంకు 32 సంఘాల మద్దతు ఉంది.

జడ్జీల మాటల వక్రీకరణ తగదు

బోండా ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీనియర్ జడ్జీల మాటలను వక్రీకరించడం భావ్యం కాదని మాజీ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీనియర్ జడ్జి మాట్లాడిన మాటలను వక్రీకరించి రాస్తున్నారని, ఇది దుర్మార్గమైన చర్యని అన్నారు. చంద్రబాబుపై మోపబడిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో వైసీపీ నాయకులు ఐదేళ్లలో ఐదు పైసల అవినీతిని నిరూపించలేకపోయారని చెప్పారు. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన అడ్వకేట్ జనరల్ పోస్టును మరచి వైసీపీ అధికార ప్రతినిధిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంటు కేసులో మొదట రూ.3,300 కోట్లు అవినీతి జరిగిందని అన్నారని, ఆ తర్వాత రూ. 317 కోట్లన్నారని, ఆఖరికి రూ. 27 కోట్లు పార్టీ ఖాతాలోకి వెళ్లాయని అబద్ధపు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి సాక్ష్యాలు చూపే ధైర్యముందా అని ప్రశ్నించారు. తాము సెక్షన్ 17ఏ మీద క్యాష్ పిటిషన్ వేశామని, ప్రభుత్వం పేరుమోసిన న్యాయవాదులను పెట్టి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సుప్రీం కోర్టుకు సాక్ష్యాలు చూపించలేకపోయారని, దీంతో వైసీపీ ప్రభుత్వపు డొల్లతనం ఒక్కొక్కటిగా బయటపడుతోందని ఆరోపించారు.

కేఆర్ఎంబీకి సాగర్ నిర్వహణ

(మొదటిపేజీ తరువాయి)

సాగర్ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాన్ని సూచనప్రాయంగా చెప్పారు. తెలంగాణ అధికారులు శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఏపీ ప్రభుత్వ చేతుల్లో ఉందని ముఖర్జీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ నాగార్జునసాగర్ వ్యవహారంపై మాత్రమే ఇప్పుడు మాట్లాడాలని కోరారు. కేఆర్ఎంబీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్గతంగా చర్చించుకొని చెప్తామని కేంద్ర అధికారులకు తెలిపారు. విద్యుత్తు ప్రాజెక్టులు సహా సాగర్ పరిధిలో ఉన్న అవుట్‌లెట్స్, సాంకేతిక పరిమితులు వంటి విషయాలపై కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు. సాంకేతికపరమైన అంశాలపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని చర్చించుకోవాలని జలశక్తి కార్యదర్శి సూచించారు. సాగర్ పరిధిలో సీఆర్పీఎఫ్ భద్రత కొనసాగించడంపై రెండు రాష్ట్రాల అధికారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎంల భేటీ సారాంశ నివేదిక పంపిన తరువాత మరోసారి సమావేశం ఉంటుందని ముఖర్జీ తెలిపారు.

కృష్ణాజలాల వినియోగంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తకుండా చూసేందుకు 2014లో కేంద్ర కృష్ణానదీ యాజమాన్య బోర్డును ఏర్పాటు చేసింది. బోర్డు పరిధిని నిర్దేశించేవరకు శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను ఏపీ ప్రభుత్వానికి, సాగర్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించింది. అయితే తమ భూభాగంలో ఉందంటూ శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ సర్కారు తన అధీనంలోకి తీసుకుంది. ఎగువున వరద ప్రవాహం లేకున్నా ఎడమగట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ శ్రీశైలం ప్రాజెక్టును ఖాళీ చేస్తోంది. దీనివల్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు నీరందించే అవకాశం కోల్పోవడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్ ప్రాజెక్టుకు తరలించిన దాదాపు 17 టీఎంసీల జలాలను కూడా కుడి కాలువకు విడుదల చేయకుండా ఏపీ హక్కులను కాలరాసింది. ఈ తంతు వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి జరుగుతున్నప్పటికీ తెలంగాణ ఎన్నికల సందర్భంగా గత ఏడాది నవంబరు 30వ తేదీన రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణ పేరుతో ఏపీ ప్రభుత్వం పెద్దఎత్తున పోలీసు బలగాలను డ్యామ్‌పైకి పంపి సాగర్ స్పిల్‌వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకుంది. దీంతో రెండు రాష్ట్రాలకు చెందిన పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకు న్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బలగాలు రంగ ప్రవేశం చేసి ప్రాజెక్టును అదుపులోకి తీసుకున్నాయి. దీనిపై శాశ్వత పరిష్కారం కోసం ముఖర్జీ రెండు రాష్ట్రాల అధికారులతో ఢిల్లీలో సమావేశం నిర్వహించి ఇకపై సాగర్ ప్రాజెక్టు నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

25న బ్యాంకుల సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

బ్యాడ్జిలు ధరించి నిరసనలో ఉద్యోగులు పాల్గొంటారు. అయితే 25వ తేదీన దేశవ్యాప్త సమ్మె, ఆ తర్వాత 26వ తేదీ నుంచి మూడు రోజులు సెలవులు ఉండటంతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగబోతోంది. ఇదిలా వుంటే, నాలుగు యూనియన్లు... ఆలిండియా యూనియన్ బ్యాంక్ స్టాఫ్ ఫెడరేషన్ (ఎన్‌సీబీఈ అనుబంధ సంఘం), యూనియన్ బ్యాంక్ స్టాఫ్ అసోసియేషన్ (ఎన్‌ఓబీడబ్ల్యూ అనుబంధ సంఘం), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ యూనియన్ ఢిల్లీ శాఖ, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సంఘం) సంయుక్తంగా 14 డిమాండ్లు చేశాయి. ఛత్ర సంస్థ యూనియన్ బ్యాంక్ యూనియన్ల ఉమ్మడి ఫోరం పిలుపుమేరకు 25వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు యూబీఐ ఉద్యోగులు నడుం బిగించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెక్షన్ (ఐబీపీఎస్) ద్వారా క్లర్కుల ఖాళీల భర్తీ, సబ్ స్టాఫ్ నియామకాలు, ఒప్పంద, తాత్కాలిక సిబ్బందిని సబ్ స్టాఫ్ విభాగాల్లో క్రమబద్ధీకరించడం, వారికి కనీస వేతనాలు చెల్లించడం, స్టాఫ్ హోల్డింగ్ బదిలీలు, హయ్యర్ అసైన్‌మెంట్ ఆర్డర్లు వంటి డిమాండ్లు ఉన్నాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యో గుల సమాఖ్య (కేరళ) ప్రధాన కార్యదర్శి కేఆర్ ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ క్లర్క్ పోస్టుల భర్తీ, సబ్ స్టాఫ్ కేడర్‌లో సముచిత నియామకాలు వంటివి తమ ప్రధాన డిమండ్లలో ఉన్నాయన్నారు. సరిపడ సిబ్బంది లేక వినియోగదారుకలు బ్యాంకింగ్ సేవలు సక్రమంగా అందడం లేదని చెప్పారు. వేలాది మంది ఒప్పంద కార్మికలు బ్యాంకుల్లో పనిచేస్తున్నారని, వారందరినీ క్రమబద్ధీకరిం చాలని, అప్పటివరకు కనీస వేతనాలు చెల్లించాలని ఉన్నికృష్ణన్ డిమాండ్ చేశారు. కాగా, యూబీఐకి దేశవ్యాప్తంగా 8,700 శాఖలు ఉన్నాయి. 134 ప్రాంతీయ కార్యాలయాలున్నాయి. 2020లో ఆంధ్రా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు విలీనం తర్వాత అదిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటిగా ఇది నిలిచింది.

చేనేత రంగంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ మూర్తి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ జేవీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. అనంత పురం లలితకళా పరిషత్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఈ సభకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పామిశెట్టి గోవిందు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ... ఒక్క చేనేత సామాజిక వర్గానికి చెందిన వారే కాకుండా ఇతర సామాజిక వర్గాల వారందరికీ జిల్లాలో చేనేత ఉపాధిగా ఉందన్నారు. చేనేత రంగంలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ధర్మవరానికి ఉందని తెలిపారు. ఒకప్పుడు వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధినిచ్చే విధంగా చేనేత రంగం ఉందన్నారు. మిల్లు వస్త్రాలు వచ్చినప్పటి నుంచి చేనేత వస్త్రాలపై నిర్లక్ష్యం ఏర్పడిందని తెలిపారు. చేనేత రంగం ఒక రకంగా వ్యవసాయ రంగానికి మద్దతు ఇచ్చే రంగం అన్నారు. చేనేత ఉత్పత్తులు ఏం కావాలన్నా వ్యవసాయ రంగం నుంచి రావాలన్నారు. పరస్పర ఆధారిత చేనేత రంగానికి ఇవ్వవలసిన మద్దతు ప్రభుత్వాలు ఇవ్వట్లే దన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేనేతపై ప్రసంగాలు చేయడం తప్ప చేనేత అభివృద్ధికి చేసిందేమీలేదన్నారు. అందరినీ చేనేత వస్త్రాలు ధరించమని చెప్పే మోదీ... తాను మాత్రం చేనేత వస్త్రాలు ధరించరన్నారు. మోదీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ వారానికి ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించి విధులకు హాజరు కావాలని ఒక జీవో విడుదల చేస్తే తద్వారా చేనేత రంగం వర్ధిల్లడానికి అవకాశం ఉంటుందన్నారు. మన రాష్ట్రానికి సంబంధించి సీఎం వైఎస్ జగన్... మగ్గం నేసే వారికి సంవత్సరానికి రూ.24 వేల రూపాయలు ఇస్తానని చెప్పి ఏటా కోత విధిస్తున్నారన్నారు. నూలు మీద జీఎస్టీ ఎత్తివేసి సబ్సిడీకి నూలు, ఇతర ఉపకరణాలు సరఫరా చేయాలన్నారు. దాంతోపాటు చేనేత ఉత్పత్తులమీద ప్రభుత్వం రిబేటు ప్రకటించి, ఆప్కో ద్వారా వస్త్రాలు మార్కెటింగ్ చేయాలని... చేనేత కార్మికులు, సొసైటీల ద్వారా సేకరించిన వస్త్రాలకి సకాలంలో ఆప్కో ద్వారా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20,21వ తేదీలలో గుంటూరులోని మంగళగిరిలో జరిగే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీ జాఫర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి, చేనేత కార్మిక రంగం జిల్లా కన్వీనర్ ఎన్ శ్రీరాములు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీ కేశవరెడ్డి, చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకుడు నీలూరు లక్ష్మయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి వీకే కృష్ణుడు, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు రమణయ్య, అల్లీపీర, అధిక సంఖ్యలో నేతన్నలు, చేనేత కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంపశయ్యపై వైద్య ఆరోగ్యశాఖ

మన్యంలో హృదయవిదారక ఘటనలే సాక్ష్యం: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ ఏజెన్సీలోని హృదయ విదారక ఘటనలపై ఏమి సమాధానం చెబుతారని ముఖ్యమంత్రి జగన్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. విశాఖ ఏజెన్సీలోని శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర పంచాయతీ శివారు చిట్టింపాడుకు చెందిన మాదల గంగులు ఎదుర్కొన్న హృదయ విదారక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, రాష్ట్రంలో అంపశయ్యపైకి చేరిన వైద్య, ఆరోగ్య రంగ పరిస్థితులకు ఈ ఘటన అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. గంగులు, గంగమ్మ దంపతుల ఆరునెలల ముక్కుపచ్చలారని కుమారుడు అనారోగ్యానికి గురికాగా, ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో డోలీపై ఈనెల 5న ఎస్.కోట తీసుకెళ్లారు. అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో డాక్టర్ల సూచనతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. 6వ తేదీన ఆ చిన్నారి కన్నుమూశాడు. అప్పటికే కిడ్నీవ్యాధితో బాధపడుతున్న గంగమ్మ కడుపుకోతతో తీవ్ర మానసిక క్షోభకు గురై మంగళవారం తుదిశ్వాస విడిచింది. గుండెబద్దలైన గంగులు...తన భార్య మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై కొద్దిదూరం, డోలీపై మరికొంతదూరం మోసుకెళ్లాడు. రాష్ట్రంలో మారుమూల గిరిజనులు ఎదుర్కొంటున్న పరిస్థితులను ఈ ఘటన కళ్లకు కడుతోంది. అసమర్థుడి పాలనలో గిరిజన బిడ్డలకు సరైన వైద్యం అందించడం చేతకాలేదని, కనీసం మృతదేహాన్ని తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేయలేరా అని నిలదీశారు. ఫోన్ కొట్టిన వెంటనే కుయ్... కుయ్ అంటూ అంబులెన్స్ పరుగెత్తుకొస్తుందని గాలికబుర్లు చెప్పే ముఖ్యమంత్రి... దీనికి ఏమి సమాధానం చెబుతారని లోకేశ్ ప్రశ్నించారు.

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి

పిల్లలమర్రి నాగేశ్వరరావు విజ్ఞప్తి

విశాలాంధ్ర-మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సంఘం 13వ రాష్ట్ర మహాసభలు గుంటూరు జిల్లా మంగళగిరిలోని మార్కండేయ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర మహాసభ నిర్వహణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆహ్వానసంఘం గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల వరప్రసాద్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్యతో కలిసి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ నేతన్నలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కారానికి పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. నేతన్నల సమస్యలపై పోరాడే ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు హాజరై జయప్రదం చేయాలని చేనేతలకు పిలుపునిచ్చారు. మహాసభల్లో భాగంగా 20వ తేదీ మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర సదస్సు జరగనుందని తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి కె.వియన్నారావు, చేనేత నిపుణులు ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకటకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహనరావు, నియోజకవర్గ అధ్యక్షులు బత్తుల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం తగదు

డిమాండ్లు పరిష్కరించే వరకూ ఉద్యమం: లలితమ్మ

విశాలాంధ్ర-వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ విమర్శించారు. డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 37వ రోజుకు చేరుకుంది. ఇక్కడ జరిగిన అంగన్‌వాడీల నిరసన దీక్షలో లలితమ్మ మాట్లాడుతూ జులైలో వేతనాలు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, ఎంత పెంచుతుందో స్పష్టత ఇవ్వడం లేదని చెప్పారు. అంగన్‌వాడీలకు సంబంధించిన డిమాండ్లపై కచ్చితమైన హామీ ఇవ్వడం లేదన్నారు. సరైన హామీ వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆమె స్పష్టంచేశారు. అంగన్‌వాడీలు విజయవాడలో అమరణ నిరాహార దీక్ష ప్రారంభించారని, ఎంత వేతనం ఇస్తారో స్పష్టం చేసే వరకూ దీక్ష కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమానపనికి-సమాన వేతనం నినాదంతో ఈ పోరాటం సాగుతోందని, తమ 11 డిమాండ్లు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు శిరీష, కామేశ్వరి, రేణుక, వెంకటేశ్వరమ్మ, లక్ష్మిదేవి, షమీనా, సుజాత, అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా

అఖిలపక్షాల సంతకాల సేకరణ

విశాలాంధ్ర-ఏలూరు: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా ఏలూరులో అఖిలపక్ష పార్టీలు సంతకాల సేకరణ ప్రారంభించాయి. బుధవారం ఉదయం ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఎం ఏలూరు కార్యదర్శి పీ కిషోర్, సీపీఐ (ఎంఎల్), న్యూ డెమోక్రసీ నాయకులు బద్ద వెంకటరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్రావు, జనసేన నగర అధ్యక్షులు కాశీ నరేశ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణ కంటే ఒక వెయ్యి అదనంగా జీతం చెల్లిస్తామన్న హామీని అమలు చేయమని ఐదేళ్ల నుండి అడుగుతున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే గత్యంతరం లేక అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీ అమలు చేయకపోగా....సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ఎస్మా చట్టాన్ని తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడని అంగన్‌వాడీలు మొక్కవోని దీక్షతో 37 రోజులుగా సమ్మె చేస్తున్నారని అఖిలపక్ష నాయకులు వారిని అభినందించారు. ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణలో ఇస్తున్నదాని కంటే ఒక వెయ్యి అదనంగా జీతం పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పరిష్కారం చేయకుండా కేవలం పదవీ విరమణ వయసు పరిమితి రెండు సంవత్సరాలు పొడిగించి... అన్ని సమస్య లు పరిష్కరించినట్లు ప్రచారం చేస్తోందన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పోలిస్తే అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి ఇప్పటికైనా అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే అఖిలపక్ష పార్టీలన్నీ అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా రాష్ట్ర బంద్ కు పిలుపునివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు కే కృష్ణమాచార్యులు, సీపీఐ ఏలూరు నగర కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, చేతి వృత్తిదారుల జిల్లా కార్యదర్శి పీ ఆదిశేషు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బళ్ల కనక దుర్గారావు, తెర్లాపు శ్రీను, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి గొర్లి స్వాతి, ఉపాధ్యక్షురాలు మావూరి విజయ, బేతా శంకర్, శాయన బాలు, సీపీఎం నాయకులు ఎస్ సత్యనారాయణ, జీ కోటేశ్వరరావు, ఎం ఇస్సాక్, సత్యం, యేసు బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గణపతి రాజు, రాజేష్, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణను విమర్శించే అర్హత మీకుందా?

ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి వేమయ్య యాదవ్ ప్రశ్న

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామకృష్ణను విమర్శించే స్థాయి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి లేదని పార్టీ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కాటమయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.మధు అన్నారు. రామకృష్ణ గతంలో ఎమ్మెల్యేగా పేదలకు ఎంతో సేవలు చేశారన్నారు. తోపుదుర్తి గ్రామానికి బీటీ రోడ్డు వేయించారని, అనేకమంది పేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పించారని గుర్తుచేశారు. పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ఉన్న 49 చెరువులకు నీళ్లు తెచ్చిన ఘనత రామకృష్ణదే అని బుధవారం విలేకరులతో మాట్లాడిన నేతలు కొనియాడారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు పది టీఎంసీల నీటి కోసం పోరాడి జైలు కూడా వెళ్లారని, ఆయన పోరాట ఫలితంగానే అప్పటి ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. రాప్తాడు ఎమ్మెల్యేగా ఆ నియోజకవర్గ ప్రజల కోసం ఏమి చేశారని ప్రకాశ్‌రెడ్డిని నాయకులు ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలను తిడితే పదవులు ఇస్తారనే ఉద్దేశంతో ఆయన సీపీఐని విమర్శిస్తున్నారని, ఇకపై ఇలాంటివి మానుకోవాలని తేల్చిచెప్పారు. లక్ష ఎకరాలకు నీరు ఇస్తానన్న మాట ఏమైందని ఎమ్మెల్యేని నిలదీశారు. జగనన్న కాలనీలో బెంగాల్ కార్మికులను నిర్బంధించడంపై ఆ రాష్ట్ర పార్లమెంటు సభ్యుడు.... అనంతపురం జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి లేఖ రాశారని, ఈ ఘటనపై ప్రకాశ్ రెడ్డి సంజాయిషీ చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రకాశ్ రెడ్డి అక్రమాలను, దౌర్జన్యాలను బహిర్గతం చేసే పత్రికలపై, రామకృష్ణపై విమర్శలు చేయడాన్ని మానుకోవాలన్నారు. అనంతపురంలోని జగనన్న కాలనీలో పనిచేస్తున్న తొమ్మిది మంది బెంగాల్ కూలీలను రక్షించాల్సిన పోలీసులు... ఎమ్మెల్యే అనుచరులుగా పనిచేయడం దారుణమని, ఈ వ్యవహారంలో విచారణ జరపాలని రామకృష్ణ డిమాండ్ చేశారన్నారు. సమావేశంలో సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జేవీ రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, కార్యవర్గ సభ్యులు మహదేవ్, కనగానపల్లి మండల కార్యదర్శి మల్లికార్జున, రామగిరి మండల కార్యదర్శి ముత్యాలప్ప, చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి రమణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకల రాజా పాల్గొన్నారు.

రాముడిని రాజకీయ సాధనంగా మార్చిన మోదీ

రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోని సర్వ మతాలు గౌరవించే శ్రీరాముడిని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ... రాజకీయ లబ్ది కోసం ఒక సాధనంగా ఉపయోగిస్తోందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి తీవ్రంగా విమర్శించారు. మోదీ పాలనలో దేశంలోని మేధావి వర్గం, ప్రతిపక్ష రాజకీయవేత్తలు మాట్లాడలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. రామరాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. విజయవాడ ఆంధ్ర రత్న భవన్ లో బుధవారం ఆయన విలేకరుల సమావేశ నిర్వహించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం అసంపూర్తిగా ఉన్నందున విగ్రహ ప్రతిష్ఠాపనకు తమ పార్టీ హాజరు కావడం లేదన్నారు. అనేక మంది పీఠాధిపతులు కూడా హాజరు కావడం లేదని ఆయన పేర్కొన్నారు. దేశంలో దళితులు, అణగారిన వర్గాల మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే నరేంద్ర మోదీ నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నరేంద్ర మోదీకి తాకట్టు పెట్టారని, ప్రత్యేక హోదాపై మోదీని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోతే, జగన్ తండ్రి ఆశయాలను తుంగలో తొక్కారని విమర్శించారు. జగన్ పాలన ల్యాండ్ స్కామ్‌గా సాగుతోందని విమర్శించారు.

రోగుల పర్యవేక్షణ బాధ్యత నర్సులదే

ఆయుష్ ఆసుపత్రి చైర్మన్ రమేశ్‌బాబు

విశాలాంధ్ర- విజయవాడ: రోగులకు మెరుగైన చికిత్స అందించడంలో నర్సులు బాధ్యతగా వ్యవహరించాలని, వైద్యుల కన్నా నర్సులకే రోగులతో సత్సంబంధాలు ఉంటాయని ఆయుష్ హాస్పిటల్ చైర్మన్ వై.రమేశ్ బాబు చెప్పారు. ఆయుష్ హాస్పిటల్, బీడీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త అధ్వర్యంలో ఐవీ క్యాన్‌ల ద్వారా ఆధునిక వైద్యం అందజేయడంలో శిక్షణను బుధవారం ఆసుపత్రిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేశ్‌బాబు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సింగ్ పర్యవేక్షక వైద్యులు కె.రమాదేవి నేతృత్వం వహించారు. బీడీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎస్.హరికృష్ణ మాట్లాడుతూ రోగుల చేతులకు ఐవీ క్యాన్‌లు పెట్టడం, తొలగించే సమయంలో సరైన జాగ్రతలు లేకపోతే రోగితో పాటు నర్సులకు ఇన్ఫెక్షన్ వచ్చి ప్రాణాలకు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మణికట్టు, చేతులకు పెట్టినపుడు శరీరంలో ఇతర ఇబ్బందులు రాకుండా చూడాలని, ఉపయోగించిన వాటిని నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చూడాల్సిన బాధ్యత నర్సులపై ఉందని వివరించారు. హాస్పిటల్ వైద్యులు గోపాలకృష్ణ, ఎమ్ఎస్ జయలక్ష్మి, కేవీ ప్రసాద్, బీడీ సర్జికల్ సిబ్బంది డి.సతీశ్, జి.ఫణి, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేనానితో మాజీమంత్రి కొణతాల భేటీ

అనకాపల్లి ఎంపీ టికెట్‌పై గురి

విశాలాంధ్ర బ్యూరో, అనకాపల్లి: ఉత్తరాంధ్రలో సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ బుధవారం హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిశారు. పవన్ కల్యాణ్ తో జరిగిన భేటీలో ఉత్తరాంధ్రకు సంబంధించిన విషయాలు చర్చించినట్లు చెబుతున్నప్పటికీ ఆయన అనకాపల్లి నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇస్తే జనసేనలో చేరుతానని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్న కొణతాల... టీడీపీలో చేరతారని భావించినప్పటికీ ఆయనకు శాశ్వత శత్రువుగా ఉన్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఈ మధ్యనే టీడీపీ కండువా కప్పుకున్నారు. దీంతో తన ఆలోచనలను విరమించుకున్న కొణతాల... వైసీపీలోకి వెళ్లలేక జనసేనను ఆశ్రయించినట్లు తెలిసింది. ఏదేమైనా ఉత్తరాంధ్రలో రాజకీయ ఉద్దండులుగా పేరుగాంచిన మాజీ మంత్రులు కొణతాల, దాడి రాజకీయ భవిష్యత్తు అగమ్య గోచరంగానే ఉంది. టీడీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్లు బైరా దిలీప్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రచారం చేసుకుంటున్నారు. మరోపక్క మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సైతం తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ కావాలని అధిష్ఠానానికి ఇప్పటికే దరఖాస్తు చేసేశారు. టీడీపీలోనే ఎంపీ టికెట్ పై పోటీ ఉంటే జనసేన నుంచి కొణతాల రామకృష్ణకు ఎంపీ అభ్యర్థిగా టికెట్ కేటాయిస్తారా? ఎంపీ టికెట్ పై ఆశలు పెట్టుకున్న అయ్యన్న, బైర సహకరిస్తారా అనేది వేచి చూడాలి. బీసీ సామాజికవర్గానికి చెందిన కొణతాల రామకృష్ణ 1989 నుండి 1996 వరకు అనకాపల్లి ఎంపీగా ఉన్నారు. 1991 నుండి 1996 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఎంపీల కన్వీనర్‌గా పనిచేశారు. 2004 నుండి 2009 వరకు వైఎస్ కేబినెట్‌లో వాణిజ్యపన్నులు, ఎక్సైజ్, న్యాయ తదితర శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. వైఎస్ మరణానంతరం వైఎస్ఆర్‌సీపీలో రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల అనంతరం ఆ పార్టీకి రాజీనామా చేసి రాజకీయాలకు దూరంగా ఉంటూ ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాడుతున్నారు.

అంబేద్కర్ ఆశయాల అమలు జగన్‌కే సాధ్యం

సామాజిక సమతా సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరించిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్పం సభల కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు బుధవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేశ్, ఎంపీ నందిగం సురేశ్, పార్టీ ఎస్సీ విభాగ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని చెప్పారు. భిన్న సంస్కృతులు, భిన్న సంప్రదాయాలు, భిన్న ఆచార వ్యవహారాలు గల భారతదేశ గతిని, దిశను మార్చిన ఘనత అంబేద్కర్ కు దక్కుతుందని చెప్పారు. దళిత, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ నిలువెత్తు రూపంగా నిలిచారని ఆయన కొనియాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సమసమాజాన్ని నిర్మించిందని, దేశ భవిష్యత్తుకు ఆ రాజ్యాంగమే దిక్సూచిగా నిలిచిందని ఆయన అన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం జగన్...అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా పాలన చేస్తున్నారని తెలిపారు. దేశంలో మరెక్కడా లేని విధంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని చెప్పారు. విగ్రహం ఏర్పాటు ద్వారా చరిత్ర పుటల్లో సీఎం జగన్ నిలిచిపోతారని చెప్పారు. ఏపీ ప్రజలు కోరుకున్న విధంగానే సమతా న్యాయ శిల్పాన్ని జగన్ రూ.400 కోట్లతో ఏర్పాటు చేశారని, ఈ విగ్రహాన్ని ఈ నెల 19న సీఎం ఆవిష్కరిస్తారని ఆయన తెలిపారు. అంబేద్కర్ ప్రజల మనిషి అని, విగ్రహావిష్కరణకు అందరూ ఆహ్వానితులేనని చెప్పారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ గతంలో అంబేద్కర్‌ను అవమానించిన ప్రభుత్వాలను చూశామని పరోక్షంగా చంద్రబాబును విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ముళ్ల పొదల్లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానన్నారని, చివరికి అది కూడా చేయలేదన్నారు. మంత్రి ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన స్వరాజ్ మైదానాన్ని గత పాలకులు ఇష్టారాజ్యంగా వాడుకున్నారని చెప్పారు. ఇదే స్థలంలో సీఎం జగన్ అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, అంబేద్కర్ భావజాలాన్ని, ఆలోచనలను జగన్ ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను కేవలం ఓట్ల కోసమే వాడుకున్నారుగానీ... ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్న జగన్‌కు ఎల్లవేళలా రుణపడి ఉంటామని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సామాజిక సలహాదారుడు జూపూడి ప్రభాకర్ రావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

దేశాభ్యున్నతికి లెనిన్ సిద్ధాంతం మార్గదర్శకం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శ్రామికవర్గ విప్లవ నేత, 20వ శతాబ్దపు మార్క్సిస్టు మేధావి వీఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా, ఈనెల 21 నుంచి సంవత్సరం పొడవునా చేపట్టనున్న వివిధ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రగతి శీలవాదులు అందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని నివాళులర్పించాలని కోరారు. ప్రపంచంలోనే మొట్టమొదటి శ్రామికవర్గ రాజ్యం సోవియట్ యూనియన్ సాధించిన ఘనత లెనిన్ నాయకత్వానికే దక్కుతుం దన్నారు. కష్టపడి సంపద సృష్టించే వర్గాలు-రైతులు, కూలీలు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు, వృత్తి దారులు తదితరులకే సంపదపై అధికారం ఉండాలని, అలాంటి వారికే రాజ్యాధికారం కావాలని పోరాడారని గుర్తుచేశారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ దశలో ప్రజల సంపద కార్పొరేట్ పాలవుతున్న కాలంలో లెనిన్ సిద్ధాంత ఆవశ్యకత మరింత పెరిగిందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని లెనిన్ గట్టిగా బలపరిచారని పేర్కొన్నారు. సామాజిక అణిచివేతలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆనాటి సామాజిక ఉద్యమాలని ఆయన ప్రత్యేకంగా గమనంలోకి తీసుకున్నారని తెలిపారు. ఇంత దూర దృష్టి కలిగిన మహా నాయకుడి శత వర్ధంతిని జరుపుకోవడం మన అందరి బాధ్యతని, యువత బంగారు భవిష్యత్తుకు దారీ చూపే దేశ అభ్యున్నతికి లెనిన్ సిద్ధాంతం మార్గ దర్శకం అవుతుందని వివరించారు. ప్రజలందరూ ఈ సందర్భంగా జరిగే సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ANDHRA PRADESH ELECTRICITY REGULATORY COMMISSION

11-4-660, 4th Floor, Singareni Bhavan, Red Hills, Hyderabad - 04

Applications are invited for the posts of Office Subordinate in **APERC** on direct recruitment. The last date for submission of applications is **24-01-2024.** For further details please visit our website: **www.aperc.gov.in/Careers**

Hyderabad. Dt.10-01-2024 **Commission Secretary i/c**

DIPR No.2616PP/CL/Advt-I/1/21-22, Dt : 17-1-2024

సంపాదకీయం

అన్ని అడుగులూ మత రాజకీయం వేపే

ముందు అనుకున్నట్టుగా అయితే వచ్చే 22వ తేదీన అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామ మందిరంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేయాలి. కానీ అసలు 22న ఆ పని చేయడానికి మంచి ముహూర్తం కాదనీ, మోదీతో పాటు ఆయన భార్య ఉండరు కనక అసలు ఆయనకు ప్రాణప్రతిష్ఠ చేసే అవకాశమే లేదన్న విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలు ప్రధానంగా ఆది శంకరుడు స్థాపించారంటున్న నలుగురు శంకరాచార్యుల నుంచి వచ్చాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలో రాముడి విగ్రహాల ప్రతిష్ఠ ద్వారా మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారన్న విమర్శలు గట్టిగా వినిపించాయి. కానీ మోదీ రాజకీయ పార్టీల అభ్యంతరాలకన్నా నలుగురు శంకరాచార్యుల అభ్యంతరానికే ఎక్కువ జడుసుకున్నారని అందుకే ఇప్పుడు ఆయన ప్రాణ ప్రతిష్ఠలో ప్రధాన యజమానిగా ఉండరనీ ఆయన బదులు అనిల్ మిశ్రా, ఆయన భార్య కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తారని అంటున్నారు. ప్రాణ ప్రతిష్ఠలో ప్రధాన యజమానిగా నరేంద్ర మోదీ ఉండకపోవడం పెద్ద పరిణామమే కావచ్చు. కానీ ఆయన ప్రధాన యజమాని (నిర్వాహకుడు) పాత్ర పోషించకపోయినా మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవాలన్న సంకల్పానికి మాత్రం ఎలాంటి విఘాతమూ ఉండే అవకాశం లేదు. ఈ మేరకు మోదీ పంతం నెగ్గినట్టే. ప్రాణ ప్రతిష్ఠ మోదీ నిర్వహించడం దగ్గరనుంచి ఆలయం పూర్తి కాకుండానే అసలు ప్రాణ ప్రతిష్ఠ ఎలా చేస్తారన్న దాకా అనేక విమర్శలు వచ్చాయి. ఇవన్నీ మోదీని భయపెట్టి ఉంటాయి. అందుకే ఆయన ఎటూ 22న ప్రధాన పాత్రధారిగా ఉండకపోయినా ఆ ముహూర్తం రోజు దాకా రోజుకో దేవాలయం సందర్శించి ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. దీనినే అనుష్ఠానం అంటున్నారు. ఇందులో భాగంగానే మోదీ మంగళవారం ఆంధ్రప్రదేశ్ లోని లేపాక్షిలో ఓ ప్రముఖ దేవాలయాన్ని సందర్శించారు. మిగతా రోజుల్లో కూడా ఇలాంటి ఆలయ దర్శనంలో నిమగ్నమై ఉంటారు. ప్రాణ ప్రతిష్ఠ సమయంలో మోదీ ప్రధాన యజమానిగా ఉన్నా లేకపోయినా రామ మందిర నిర్మాణం ఆయన కృషి ఫలితమేనన్నది జనం మనసుల్లో నాటుకుపోయింది. అంటే ఆయన లక్ష్యం నెరవేరినట్టే. తద్వారా బీజేపీకి 2024 సార్వత్రిక ఎన్నికలలో ఏ మేరకు ప్రయోజనం ఉంటుందో వేచి చూడాల్సిందే. కానీ ఈ నాణానికి మరో వేపూ ఉంది. అద్వాణీ రథయాత్ర తరవాతే హిందువుల్లో మతానురక్తి పెరిగింది. రామాలయం నిర్మిస్తే తప్పేమిటి అని సాధారణంగా మతతత్వ వాదులు కాని హిందువులు కూడా ప్రశ్నించడం మొదలు పెట్టారు. రథయాత్ర తరవాత వెంటనే బీజేపీకి కేంద్రంలో అధికారం దక్కి ఉండకపోవచ్చు కానీ అంతిమంగా బాబరీ వివాదమే బీజేపీకి రాజకీయ పరమపద సోపాన పటంలో పెద్ద నిచ్చెనగా ఉపకరించిన మాట వాస్తవం. 2024 ఎన్నికలలో జనాన్ని ఆకర్షించడానికి మోదీ దగ్గర మరో ఆకర్షణీయమైన అంశం ఏమీలేదు. తాను చేసిన వాగ్దానాలు నెరవేర్చలేదు కనక వాటి గురించి ఎంత ప్రచారం చేసినా ఫలితం లేదన్న విషయం ఆయనకు తెలుసు. అందుకే రామమందిర నిర్మాణం సంపూర్ణంగా పూర్తి కాకపోయినా ప్రాణ ప్రతిష్ఠకు ఉపక్రమించారు. అంటే రామమందిర నిర్మాణ కీర్తి ఆధారంగా 2024లో వరసగా మూడోసారి అధికారం సంపాదించడానికి ఆలయ నిర్మాణాన్ని మించిన మార్గం లేదన్న నిర్ణయానికి ఆయన వచ్చారు.

మందిర వ్యవహారాన్ని మోదీ రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారని దుమ్మెత్తి పోస్తున్న అనేకమంది ప్రతిపక్ష నాయకులు ఆచరణలో అదే దారిలో నడుస్తున్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులకు ఆహ్వానాలు అందాయి. మందిర ఆవిష్కరణను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నందువల్ల తాము 22న అయోధ్య వెళ్లబోమని చెప్తున్న పార్టీల వారే మరో రకంగా మోదీ చేస్తున్న పనే చేస్తున్నారు. అయోధ్య వెళ్లడానికి నిరాకరించడంవల్ల హిందువుల ఓట్లు ఎక్కడ కోల్పోతామోనన్న భయంతో చాలా మంది రాజకీయ నాయకులు గుళ్లు గోపురాల చుట్టూ తిరగాలని నిర్ణయించుకున్నారు. మతం వ్యక్తిగత వ్యవహారం అని చెప్పే చాలామంది నేతలు గుళ్లు గోపురాలు తిరుగుతూ తమ మతానురక్తిని వెల్లడించేసి హిందువుల ఓట్లు పోగొట్టుకోకూడదని తాపత్రయ పడ్తున్నారు. భారత్ జోడో (న్యాయ) యాత్రలో నిమగ్నమై ఉన్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జనవరి 22న అస్సాంలోని ఓ దేవాలయాన్ని సందర్శించబోతున్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ 22న కోల్‌కతా సమీపంలోని కాళీఘాట్ ఆలయాన్ని సందర్శిస్తారట. అంతే కాకుండా "మత సామరస్య ర్యాలీ" నిర్వహిస్తారట. మత సామరస్యాన్ని కాపాడడానికి ఆమెకు కనిపించిన మార్గం కాళీ దేవాలయాన్ని సందర్శించడమే. దక్షిణ కోల్‌కతా పార్క్ సర్కస్ మైదాన్‌లో ర్యాలీ నిర్వహించడానికి ముందు ఆలయాలు, చర్చీలు, గురుద్వారాలు, మసీదులు సందర్శిస్తారట. అన్ని మతాలను సమాదరించడమే సెక్యులరిజం అనుకునే చోట ఇంతకన్నా ఏం ఆశించగలం! రామాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాల నిర్వహణలో తలమునకలై ఉన్నారు. శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రేకు ఆహ్వానం అందలేదు. నిజానికి బాబ్రీ మసీదు విధ్వంసంలో శివసైనికులు ప్రధాన బాధ్యతే నిర్వర్తించారు. 22న తమ పార్టీ నాయకులు నాసిక్‌లోని కాలారాం దేవాలయం సందర్శించి మహా హారతి నిర్వహిస్తారని ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. నాసిక్ లోని రాముడి విగ్రహం నల్లరాతితో చెక్కింది కనక దాన్ని కాలారాం దేవాలయం అంటారు. రాముడు పంచవటిలో ఉన్నారన్నది ఓ విశ్వాసం. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జగన్నాథ్ హెరిటేజ్ కారిడార్‌ను ప్రారంభించనున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని ఆర్.జె.డి. నాయకులు మాత్రం దేవాలయ సందర్శన కార్యక్రమం పెట్టుకోలేదు. తమిళనాడు ముఖ్యమంత్రి, డి.ఎం.కె. అధినేత స్టాలిన్‌కు అలాంటి ఆలోచన ఉన్నట్టు లేదు. ఎన్నికలకు ముందు ప్రజల దృష్టి మరల్చడానికే మోదీ ఈ నాటకానికి తెరతీశారని స్టాలిన్ అంటున్నారు. వామపక్ష పార్టీలకు మత విశ్వాసాలు ఉండవు కనక ఆహ్వానం అందినా తాము అయోధ్య వెళ్లేది లేదని కమ్యూనిస్టు పార్టీల నాయకులు చెప్తున్నారు. తాము మత విశ్వాసాలను గౌరవిస్తాం కానీ మోదీ మతాన్ని రాజకీయాల్లోకి చొప్పిస్తున్నారని కమ్యూనిస్టులు విమర్శిస్తున్నారు. మోదీకి పోటీగా మత కార్యకలాపాలకు దూరంగా ఉండేది ఆర్.జె.డి., వామపక్ష పార్టీలు మాత్రమే. మొత్తం మీద అనేక పార్టీల నేతలు గుళ్లు గోపురాలు చుట్టి రావడానికి ప్రధాన కారణం హిందువుల ఆగ్రహానికి గురి కాకుండా చూసుకోవడానికే. తరచి చూస్తే ఇలాంటి నాయకుల వైఖరికి మోదీ విధానానికి పెద్ద తేడా కనిపించడం లేదు.

మతంతో రాజకీయాలు ముడిపెట్టడం అధర్మం

అరుణ్ శ్రీ వత్సవ

ఆర్థికం, సంస్కృతిని ఒకటిగా కలపవచ్చు. అయితే రాజకీయాలను కలపలేము. మధ్యేవాదం, ఉదారవాదం, మతవాదంలను కలపవచ్చు. అయితే రామమందిరంతో వీటిని కలపకూడదు. 1885లో ఆవిర్భవించిననాటి నుంచి కాంగ్రెస్ అన్ని తరగతుల ప్రజలతో కలిసిమెలిసి ఉంటుంది. అయితే బీజేపీ భారతదేశ రాజకీయాల్లో పచ్చిమితవాద పార్టీగా ముద్రపడిపోయింది. కాంగ్రెస్ నిరంతరం సెక్యులర్ భావాలను అనుసరిస్తోంది. అంతేకాదు, ఆదర్శ భావజాలాన్ని అనుసరిస్తోంది. ఆర్ఎస్ఎస్, బీజేపీలు మితవాద సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నాయి. అయితే మితవాద శక్తులు తమను అనుసరిస్తాయని కాంగ్రెస్ ఆశించలేదు.

అంతేకాదు, మితవాదులు గొప్ప అవకాశవాదులు. పైగా సమజాంలో హిందూత్వశక్తులు విరివిగా, అదీ 24క్యారెట్ల శక్తులు తేలికగా లభిస్తున్నాయని కాంగ్రెస్ నాయకత్వం గుర్తించింది. తొలి నుంచి అనుసరిస్తున్న సెక్యులర్ పార్టీని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. మితవాద రాజకీయాలతో కాంగ్రెస్ ఎంతమాత్రం సహకరించరాదు. అయోధ్యలో రామాలయం ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కాకూడదని కాంగ్రెస్ అగ్రనాయకులు భావించరాదని హిందుమత వాదులు కాంగ్రెస్ నాయకులను దూషించడం ప్రారంభించారు. దూషించడం ఆశ్చర్యమేమీకాదు. మతవాదులు అలా దూషిస్తారని అనుకునేమాటే. కొంతమంది కాంగ్రెస్ నాయకులు పార్టీ పట్ల అంకిత భావం గల కాంగ్రెస్‌వాదులను బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ నాయకులు నిజంగా పార్టీకి అంకితమై ఉండాలి. అయితే ఇంతవరకు పార్టీకి అర్థవంతమైన సేవలు అందించలేదు. ఒకానొకనాడు పార్టీకి గల గొప్పతనాన్ని చెప్పుకోవడంతోనే సరిపోతుంది.

బీజేపీ నాయకుల ప్రచారాన్నిచూసి కాంగ్రెస్ నాయకులు బెదిరిపోతున్నారన్న అభిప్రాయాన్ని కల్పిస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ శక్తులు మాత్రమే హిందువులను, వారిపట్ల విశ్వాసం చూపించాలని కోరుకుంటున్నారు. అంతేకాదు. హిందువులంతా ఆర్ఎస్ఎస్, బీజేపీ అనుసరించే రాజకీయ సిద్ధాంతాన్ని అనుసరించాలని ప్రచారం చేయడం తప్పు. ఒకవేళ రాజకీయంగా హిందూ సిద్ధాంతాన్ని అనుసరించి ఉండకపోతే 2019లో జరిగిన లోకసభ ఎన్నికలకు 35శాతం ఓట్లు వచ్చేవికాదు. పుల్వామా ఘర్షణను సృష్టించిన 40 మంది సైనికులు ప్రాణత్యాగం చేశారని ప్రచారం చేయడంతో ప్రధాని మోదీ గెలవడానికి ఓట్లు సాధించగలిగారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు అనుసరిస్తున్న హిందు వ్యతిరేక భావజాలాన్ని కాంగ్రెస్ తిప్పికొట్టాలి. ఆర్ఎస్ఎస్, బీజేపీలు ప్రచారం చేస్తున్న తప్పుడు సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలి. అంతేకాదు, హిందూ వ్యతిరేక నిర్వచనం వల్లనే నలుగురు శంకరాచార్యులు రామమందిరం ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరవడం లేదని, ఒకవేళ ఆర్ఎస్ఎస్, బీజేపీలు సరైన సిద్ధాంతం అనుసరిస్తే శంకరాచార్యులు ఎందుకు రావడంలేదని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ విషయాన్ని ప్రజలదృష్టికి తీసుకువెళ్లాలి. ఈ అంశంపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా చర్చకు పెట్టాలి. సంఘపరివార్ శక్తులు మొదటినుంచి చేస్తున్న ప్రచారం హిందూ వ్యతిరేకమైందని ప్రజలకు వివరించాలి.

కాంగ్రెస్ సోషల్ మీడియా హెడ్, పార్టీ ప్రతినిధి సుప్రియ శ్రీనెట్ "శంకరాచార్యులు ఎందుకు రావడం లేదు" అని విస్తృతంగా ప్రచారం చేయడం సరైందే. ఈ నేపథ్యంలో పార్టీ నూతన సిద్ధాంత పంథాన రూపొందించుకోవలసిన అవకాశం. రాహుల్‌గాంధీ, ఖర్గేలు సీరియస్‌గా పార్టీని ప్రక్షాళన చేస్తూ, దళితులు, పేదలు, కార్మికులకు దగ్గరగా తీసుకువెళ్లాలి. బీజేపీ వీరిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారేగానీ, వీరికి సిద్ధాంత భావజాలాన్ని బోధించడంలేదు. అంతేగానీ వీరికి సమాజంలో ఇతరులతో సమానమైన గౌరవం ఇవ్వడంలేదు. అంతేకాదు, వారిని అంటరానివారిగా నేచూస్తున్నారు. బీజేపీ ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని మళ్లీ ఎన్నికల్లో గెలిచినట్లయితే కాంగ్రెస్ పరిస్థితి వెనుకపట్టుపడుతుంది. హిందుత్వ విషయంలో సంఘపరివార్ శక్తులపట్ల కాంగ్రెస్ ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ఈ ఎన్నికల్లో అనుసరించవలసిన ఎత్తుగడలు, వ్యూహాలను ఆర్ఎస్ఎస్, ఈ సంస్థ అధినేత మోహన్ భగవత్‌లు రూపొందించారు. తాము సనాతన ధర్మాన్ని అనుసరిస్తామని చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ తిప్పికొట్టాలి. శంకరాచార్యులు సనాతన ధర్మ వ్యతిరేకులని ప్రచారం చేయడమేగాక, హిందుధర్మానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అత్యున్నత స్థానాలనుంచి వైదొలగాలని కూడా శంకరాచార్యులను ఒత్తిడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సంఘపరివార్ శక్తుల దుష్టాచారాలను బలంగా ప్రజల ముందు వెల్లడించాలి. ఆర్ఎస్ఎస్ అవసరమైతే తమ కార్యకర్తలనే శంకరాచార్యుల స్థానంలో నిలపగలరన్న విషయం తెలిసిందే. అయితే శంకరాచార్యులను ఎదిరించడానికి సంఘపరివార్ సాహసించలేకపోవచ్చు. నరేంద్రమోదీ మార్గదర్శకంలో బీజేపీ నాయకత్వమంతా తేలికగా అబద్ధాలు చెప్పే కళను బాగా నేర్చుకున్నారు. కాంగ్రెస్ ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని ప్రచారంచేస్తూ కాంగ్రెస్‌ను దూషిస్తున్నారు. ముస్లింలు ఇతర దేశస్థులని ప్రచారం చేస్తూనే వాళ్ల ఓట్లకోసం వారిని మచ్చిక చేసుకునేందుకు నానాతంటాలుపడుతున్నారు. ముస్లింలు, దళితులు మన దేశం వాళ్లు కాదని నిరూపించి, ఈ దేశ రెండో శ్రేణి పౌరులుగా ఉండాలని ఒత్తిడి చేసేందుకు చట్టాలనుసైతం చేశారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు శంకరాచార్యులపై ఏ మాత్రం గౌరవంలేదు. నరేంద్ర మోదీ ప్రధానిగా నూతన భారతాన్ని సృష్టించే దిశగా పాలన సాగిస్తున్నారు. స్వాతంత్ర్యం కోసం జరిపిన మహత్తర పోరాటానికి ఎలాంటి విలువలేకుండా చేశారు. పైగా మహాత్మాగాంధీ, నెహ్రూలను సైతం అవమానిస్తున్న విషయం ప్రజాస్వామ్య శక్తులు, నిజమైన హిందువులు గుర్తించాలి. దేశానికి కలగనున్న హానిని నివారించాలి.

తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వేడి

మక్కెన సుబ్బారావు

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి కోడిపందాలే కాదు, ఎన్నికల కురుక్షేత్ర సంగ్రామానికి కూడా బరులు సిద్ధమైనాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి అధికారం బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ చేతిలోకి వచ్చినప్పటికీ, కొద్ది మాసాల్లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా లోక్‌సభ ఎన్నికలున్నందున ఎన్నికల వేడి సెగలు గక్కుతూనే ఉంది. వ్యూహాలు, ప్రతివ్యూహాలు, ఎకసెక్కాలు, ఎత్తిపొడుపు మాటలు కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య నిత్యం కొనసాగుతూనే ఉన్నాయి. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకోవడం ద్వారా తమ ఆధిక్యత నిలుపుకోవాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య నిత్యం కొనసాగుతూనే ఉన్నాయి. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకోవటం ద్వారా తమ ఆధిక్యత నిలుపుకోవాలని కాంగ్రెస్, అధికారంతోపాటు పోయిన పరువు నిలబెట్టుకోవాలని బిఆర్ఎస్, పాత నాలుగు సీట్లయినా (ముగ్గురు ఎంపీలు అసెంబ్లీకి పోటీచేసి ఓడిపోయారు) నిలబెట్టుకుని బలహీనతను బలంగా చాటుకోవాలని బీజేపీ ఆరాటపడుతున్నాయి. 17 లోక్‌సభ స్థానాల్లో ఒకటి హైదరాబాద్ మజ్లీస్‌కు రిజర్వ్‌డ్ సీటు లాంటిది అయినందున మిగతా 16 సీట్లకు మూడు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. 12 సీట్లు గెలుస్తామని అంటున్నా కాంగ్రెస్ కనీసం 9-10 సీట్లు గెలవాలన్న పట్టుదలతో ఉన్నది. రద్దు కానున్న లోక్‌సభ 3 స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు కాంగ్రెస్‌నేతలు (రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి) అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. ఇప్పుడున్న 9 స్థానాలలో తిరిగి గెలుచుకుని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని పీడకలగా మరచిపోవాలని, ప్రజలచే మరిపింపచేయాలని బిఆర్ఎస్ కలగంటోంది. అధినేత కెసిఆర్ అస్వస్థత కారణంగా కుమారుడు/వారసుడు కె.తారక రామారావు (కెటిఆర్), మేనల్లుడు హరీష్‌రావు బాధ్యత తీసుకుని పార్లమెంటరీ నియోజకవర్గాలవారీ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏదో చిన్న చిన్న పొరపాట్లవల్ల ఓడిపోయామని కార్యకర్తలను బుజ్జగిస్తూ, లోక్‌సభ ఎన్నికల్లో విజయం మనదేనని భరోసా ఇస్తున్నారు. కొత్తప్రభుత్వం అధికారం చేపట్టి నెలరోజులు కాకుండానే దానిపై విమర్శలు ఎక్కుపెడుతూ, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు జరపాలంటూ పెద్దగా గొంతెత్తుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో పెరిగిన అక్రమాలు, అవకతవకలను శ్వేతపత్రాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎండగడుతున్నందున, నాటి నుండి ప్రజల దృష్టి మరల్చే ఎత్తుగడగా ప్రభుత్వంపై ధ్వజమెత్తటంతోపాటు ఈ ప్రభుత్వం జీవితకాలం అర్నెల్లేనంటూ శాపనార్థాలు పెడుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌వారు కొనుగోలు చేయటమో, లేదా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తన చెంతకు రాబట్టుకోవడమో లోక్‌సభ ఎన్నికలు తదుపరి ఖాయమనే ఊహాగానాలు జరుగుతున్నాయి. అందువల్ల రాష్ట్రప్రభుత్వ సుస్థిరత దృష్ట్యా కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ లోక్‌సభ స్థానాలు గెలుచుకోవటం అవసరం.

అందరి కళ్లు ఏ.పి వైపే

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు రాజకీయాలు ఆసక్తికరంగా వంపులు, మలుపులు తిరుగుతోంది. లోక్‌సభ ఎన్నికలతోపాటు 25లోక్‌సభ, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. ప్రస్తుత లోక్‌సభలో ముఖ్యమంత్రి

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైకాపాకు 22మంది, టిడీపీకి ముగ్గురు సభ్యులు (ఇటీవల విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) రాజీనామాతో ఇద్దరే మిగిలారు. మచిలీపట్నం ఎంపి బాలశౌరి వైకాపాకు రాజీనామా చేశారు. అసెంబ్లీలో 175 స్థానాలకుగాను వైకాపాకు 151మంది, టీడీపీకి 23మంది సభ్యులున్నారు. వైనాట్ 175 అని జగన్ నినదిస్తుంటే, వైనాట్ 160 అంటూ టీడీపీ నేత చంద్రబాబునాయుడు తన శ్రేణులను ఎన్నికల రణక్షేత్రానికి తయారు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ, సినీ హీరో పవన్‌కళ్యాణ్ జనసేన పొత్తు ఈ కూటమిలో ఆత్మవిశ్వాసం పెంచింది. ప్రత్యర్థి వైకాపాలో అలజడికి హేతువైంది. అభ్యర్థుల ఎంపికలో జగన్‌రెడ్డి బృందం తీసుకుంటున్న జాగ్రత్తల్లో ఇది వ్యక్తమవుతోంది.

వాస్తవానికి ఏపీలో ఆగస్టులోనే ఎన్నికల ప్రచారం ప్రారంభమైందనవచ్చు. ఒకవైపు టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ 'యువగళం' పాదయాత్ర, జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శనయాత్రలు, పాదయాత్రకు ఆరంభంలో పాలకపార్టీ కలిగించిన అవరోధాలు, చంద్రబాబు నాయుడిపై స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి ఆరోపణలతో కేసు బనాయించి సెప్టెంబరు ప్రారంభంలో అరెస్టు చేయడం, జ్యుడీషియల్ రిమాండ్ విధించడం రాష్ట్ర రాజకీయ పరిస్థితిని తేజోవంతం చేసింది. ఆయనకు బెయిల్ ఇవ్వకుండా 56 రోజులు జైల్లో ఉంచడం ఆయనపట్ల సానుభూతి పెంచింది. చంద్రబాబును అరెస్టుచేసి కేసుల్లో ఇరికించి ఉక్కిరిబిక్కిరి చేస్తే టీడీపీ కుదేలవుతుందని జగన్‌మోహన్‌రెడ్డికి ఏ మహానుభావుడు సలహాఇచ్చాడో గాని అది ఆయనకే బెడిసికొట్టింది. చంద్రబాబు జైల్లో ఉండగానే ఆయన్ను పరామర్శించిన పవన్‌కల్యాణ్ రాజమండ్రి జైలు బైటనే "ప్రజాస్వామ్యం రక్షణ కొరకు జనసేన వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రకటించారు. ఇది రెండు పార్టీల్లో ఉత్సాహం నింపింది. జగన్‌రెడ్డి దుష్పరిపాలనను అంతంచేసి రాష్ట్రాన్ని విధ్వంసం నుండి అభివృద్ధివైపు నడిపించేందుకు గానుతాను వైకాపా వ్యతిరేక ఓటు చీలకుండా చూడటం తన లక్ష్యంగా ఆయన అంతకుముందే ప్రకటించారు. తాను బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏలో భాగస్వామినని, అయినా రాష్ట్రాలకోసం ఈ పొత్తు నిర్ణయం తీసుకున్నానంటూ, బీజేపీ కూడా కలిసివస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డితో అప్రకటిత పొత్తులో ఉన్న బీజేపీ అధినాయకత్వం ఇప్పటికీ ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకవైపు వైకాపాతో, రెండోవైపున పవన్‌కల్యాణ్ ద్వారా టీడీపీతో స్నేహాన్ని అది వాంఛిస్తోంది. అంటే ఏ పార్టీ అభ్యర్థులు గెలిచినా, పార్లమెంటులో ఇరుపక్షాల తోడ్పాటు తమవైపు ఉంచుకోవటమే ఈ వ్యూహం. అయితే టీడీపీ-జనసేన కూటమిలో చేరాలని రాష్ట్రనాయకుల్లో అత్యధిక మెజారిటీ కోరుతున్నారు. మోదీ-షా నాయకత్వం నుండి సానుకూల నిర్ణయాన్ని ఆశిస్తున్నారు.

అటు వైఎస్ఆర్ కాంగ్రెస్ అధినేత జగన్‌రెడ్డి ఆయన కోటరీ అభ్యర్థులను వడపోస్తోంది. ఇప్పటికీ మూడుదఫాలు ప్రకటించిన జాబితాల్లో దాదాపు 30మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల బదిలీ జరిగింది. కనీసం మరో 30-35 మందికి ఉద్వాసన లేదా బదిలీ ఉండవచ్చు. అసంతృప్తులు, అలకలు, తిరుగుబాటు,ఆయారాం-గయారంలు షరా మామూలే. ఇక టీడీపీ-జనసేన మధ్యసీట్ల పంపిణీ ప్రక్రియ అంతర్గతంగా నడుస్తోంది. ఈ మొత్తం క్రమంలో కులాలు పురులు విప్పుతున్నాయి. పవన్‌కల్యాణ్‌ను కాపు సామాజిక వర్గం నేతగా కుదించేందుకు, ఆ సామాజిక వర్గంలో చీలిక తెచ్చేందుకు వైకాపా నాయకత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఒకప్పుడు ఫలితాలు ఏకపక్షం అనుకున్నా వైకాపా ఇప్పుడు స్థితిలో లేదు. ప్రతి సీటు కోసం సామాజిక పొందికలు, ధనప్రవాహం (బటన్ నొక్కుడు బదలాయింపులు కాకుండా) తో శ్రమించక తప్పదు.

షర్మిల సారథ్యం

ఇదిలాఉండగా, జగన్‌రెడ్డి జైల్లో ఉన్నప్పుడు "జగనన్న వదిలిన బాణాన్ని" అంటూ 3వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి వెన్నుదన్నుగా నిలిచిన సోదరి షర్మిల ఇప్పుడు గునపమై ఎదురుతిరిగింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమెను ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నియమించటం రాష్ట్ర రాజకీయాల్లో మరో మలుపు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధిష్టానంతో సూత్రప్రాయ అంగీకారానికి వచ్చిన షర్మిల తన తెలంగాణ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అయితే రాష్ట్ర విభజన, జగన్‌రెడ్డి తిరుగుబాటుతో ఆంధ్రప్రదేశ్‌లో నామమాత్ర విశిష్టంగా ఉన్న కాంగ్రెస్‌పార్టీకి ఆమె ఇప్పటికిప్పుడు నిలబెట్టలేకపోవచ్చు. జగన్‌పార్టీలోని అసంతృప్తిజీవులకు ఆమె సమీకృత కేంద్రం కాగలదు. నిరాశలో ఉన్న కాంగ్రెస్‌కు బలవర్థక టానిక్ కాగలుగుతారు. అన్నా-చెల్లి మధ్య సవాలులో కాంగ్రెస్ లాభపడిన మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ నష్టపోతుంది. ఈ పరిణామాల పర్యవసానం వేచి చూడదగింది. ఇప్పుడు మిగిలిన ఆసక్తిఅల్లా టీడీపీ-జనసేన పొత్తులో బీజేపీ చేరుతుందా? సుముఖత తెలిపితే చేర్చుకుంటారా? బీజేపీని దూరంగా ఉంచడమే కూటమికి మేలని సర్వేలు తెలుపుతున్నాయి. టీడీపీ-జనసేన కూటమితో సర్దుబాట్లకు వామపక్షపార్టీలకు అభ్యంతరం లేదు. బీజేపీ భాగస్వామిగా ఉండే ఏ కూటమిలోనూ తాము చేరబోమని వారంటున్నారు. జాతీయస్థాయి "ఇండియా" కూటమిలో భాగస్వాములుగా ఉన్నపార్టీలతో సర్దుబాటుకు తాము సిద్ధమని సీపీఐ ప్రకటించింది. ఇంకా సమయముంది-పొత్తులకు స్పష్టత ఏర్పడటానికి. ఏమైనా, జగన్ గడ్డుకాలంలో ఉన్నారనటంలో సందేహంలేదు.

సీనియర్ జర్నలిస్టు
ఫోన్: 390683756

కమలనాథులను దూరంగా పెట్టండి!

వి. శంకరయ్య

ఆంధ్ర ప్రదేశ్ లో బీజేపీ ఎటూ గాని స్థితిలో తన్నుకులాడుతోంది. ఎన్నికలు ముంచుకొస్తున్నా ఒంటరిగా పోటీ చేయాలా? లేక పొత్తులతో వెళ్లాలనా? తేల్చుకోలేని సంకట స్థితిలో వుంది. ఈ అంశంలో కేంద్ర బీజేపీ నాయకత్వం దారి వేరుగా వుంది. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని లేదా ముఖ్యమంత్రి కావాలనే ఆశలో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే పీకల నిండుగా కేసుల్లో చిక్కుబడి వున్నందున కుక్కిన పేనులాగా అణగిమణగి వుంటారని అదే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే జాతీయ రాజకీయాల్లో కంటిలో నలుసు కావచ్చనే ఆలోచనలతో కేంద్ర బీజేపీ నాయకత్వం వుంది. అందువలన ఎటూ తేల్చకుండా నాన బెడుతున్నారు. అదే సమయంలో ఆంధ్ర ప్రదేశ్ బీజేపీ నాయకుల్లో అత్యధిక శాతం టీడీపీతో పొత్తు పెట్టుకోకపోతే ఒక్క స్థానంలో కూడా గెలుపొందలేమని ఆందోళన చెందుతున్నారు. కొంతమంది టీడీపీతో కలసి వెళ్లడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర పార్టీ ముఖ్య నేతల సమావేశంలో వారి వారి అభిప్రాయాలను సీల్డు కవర్లలో పెట్టి కేంద్ర నాయకత్వానికి పంపారు. అంతేకాదు రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు కొందరు నేతలు వైసిపి ప్రభుత్వ ప్రజాస్వామ్యం వ్యతిరేక విధానాలను ఎంతగా విమర్శించుతున్నా రాష్ట్ర ప్రజలు మాత్రం వైసిపీకి బీజేపీ బి పార్టీగా వుందని విశ్వసిస్తున్నారని ముఖ్యనేతల సమావేశంలో ఆందోళన వెలుబుచ్చారు.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం, ఇసుక దోపిడీ విధానాలపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ చేత విచారణకు ఆదేశించితే తప్ప ప్రజలు తమను నమ్మరని కూడా మొత్తుకున్నారు. లేకుంటే తెలంగాణ పరిస్థితి పునరావృతం అవుతుందనే ఆందోళనతో ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న మద్యం ఇసుక పాలసీలపై కేంద్రం విచారణకు ఆదేశించినట్లయితే ఈ పాటికే జగన్మోహన్ రెడ్డి పై వున్న సిబిఐ కేసులను త్వరగా విచారణకు వచ్చినట్లు కేంద్రం వ్యవహరించి వుండేది. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విచ్చలవిడిగా చేస్తున్న అప్పులను కట్టడిచేసేదని ఈ రంకు పురాణం రాష్ట్ర బీజేపీ నేతలకు తెలియదంటే నమ్మలేము. ప్రజా వ్యతిరేకత నుండి తప్పించుకొనేందుకు తంటాలు పడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విధానాలపై కేంద్ర బీజేపీ నాయకత్వం ధోరణికి రాష్ట్ర బీజేపీ నేతల అభిప్రాయాలకు సంబంధమేలేదు. అదే సమయంలో రాష్ట్ర పార్టీలో పొత్తుల కోసం తహ తహ లాడే నాయకులపై కేంద్ర నాయకత్వం గుర్రుగా వుందని చెబుతున్నారు. రాష్ట్రంలో పార్టీ నిర్మాణం గాలికి వదలిపెట్టి ఏదో ఒక రూపంలో పదవులు పొందాలని భావించడం సరికాదనే ధోరణిలో కేంద్ర నాయకత్వం వుందంటున్నారు. ఈ కొరడా చూపెట్టి రాష్ట్ర నాయకులు చేసిన పొత్తు ప్రతిపాదన పక్కన బెట్టినా ఆశ్చర్య పోనక్కరలేదు. ఇదే జరిగితే రాష్ట్రానికి పట్టిన శని ముగుస్తుంది. ఇదిలా వుండగా నిన్న మొన్నటి వరకు ఎన్డీఏ లో వున్నానని చెబుతుండిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆ ప్రస్తావన తీసుకు రావడం లేదు. టీడీపీ జనసేన కలసి ఎన్నికలకు వెళతామని చెబుతూ చంద్రబాబు నాయుడుతో బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు. ఉమ్మడి ఎన్నికల ప్రణాళిక త్వరలో విడుదల చేయనున్నారు. రాష్ట్ర బీజేపీ నేతలు కూడా జనసేన గురించి వెనకటిలాగా ప్రస్తావించడం లేదు. జగన్మోహన్ రెడ్డిని సాగనంపితే గాని రాష్ట్రానికి మోక్షం లేదని ఇందుకు టీడీపీతో పొత్తు తప్పనిసరి అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బలంగా నమ్ముతున్నారు. కేంద్ర బీజేపీ పెద్దలు ఇందుకు సిద్ధంగా లేరని తేలిపోయిన తర్వాతనే జనసేన అధినేత టీడీపీతో పొత్తు పెట్టుకున్నారని భావించ వలసి ఉంది. మరో వేపు టీడీపీలో కూడా ఎక్కువ మంది బీజేపీ పొత్తును అభిలషించడం లేదు. ప్రత్యేక హెూదా వెనుక బడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ పోలవరం ప్రాజెక్టు అంశాలతో పాటు మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కొత్తగా ట్రిబ్యునల్ నియమించడం వీటన్నింటికి తోడు చంద్రబాబు నాయుడు అరెస్టు బీజేపీ పెద్దల అనుమతితో జరిగిందనే భావన బలం వుండటంపై టీడీపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారని చెబుతున్నారు. అందుకే చంద్రబాబు నాయుడు కూడా బీజేపీతో పొత్తుపై పల్లెత్తు మాట

అనకుండా గుంభనంగా వుంటున్నారు.

బహుశా చంద్రబాబు నాయుడు మౌనం దృష్టిలో పెట్టుకొని కాబోలు తమది జాతీయపార్టీ అని అవతల వేపు నుండి ప్రతి పాదన రావాలి కదా అనే సంశయం ఒక బీజేపీ నేత వెలుబుచ్చారు. అయినా టీడీపీ నుండి ఎట్టి స్పందనలేదు. వాస్తవంలో దేశ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ హయాంలో ప్రత్యేక రాష్ట్రం విశాఖ ఉక్కు అంశాలు తప్పిస్తే పెద్దగా ఆంధ్రప్రదేశ్‌కు అపకారం చేసిన సందర్భాలు లేవు. కాని 2014 లో బీజేపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత భాషకు అందని తీవ్ర నష్టం జరిగింది. ఆ మాట కొస్తే బీజేపీ ఆమోదం లేనిదే ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగేది కాదు. 2014 ఫిబ్రవరి 20 వతేదీ రాష్ట్ర విభజన చట్టం రాజ్యసభలో చర్చల సందర్భంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ అవశేష ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హెూదా అయిదేళ్ల కాలం ప్రకటించగా బీజేపీ నేతలు పదేళ్ల కాలం కావాలని వాదించారు. తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హెూదా ఏ రాష్ట్రానికి చట్టం ద్వారా మంజూరు చేయకుండా కేవలం ప్లానింగ్ కమిషన్ ప్రతిపాదనతో ఇచ్చి వున్నా ఆంధ్ర ప్రదేశ్ వచ్చే సరికి విభజన చట్టంలో లేదని ఎగ్గొట్టారు. వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీకి రాష్ట్ర ప్రభుత్వం 24 వేల కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపితే ముష్టిగా జిల్లాకు 50 కోట్లు చొప్పున మూడేళ్లు ఇచ్చి ఎగ్గొట్టారు. విభజన చట్టం 90 మేరకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన నిధులతో పోలవరం ప్రాజెక్టు నిర్మించ వలసివున్నా ఆచరణలో ఏం జరిగింది చెప్పే పనిలేదు. దాదాపు ముప్పయిమంది బలి దానాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటు పరం చేసేందుకు బీజేపీ బరి తెగించింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రజల భావోద్వేగాలతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం చెలగాటమాడుతోంది. వీటన్నింటినీ మించి ఒక్క ఛాన్స్ ఇవ్వండని అధికారం చేపట్టి రాష్ట్ర ప్రగతి అధోగతి పాలు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల గుప్ప చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని అన్ని విధాలా కాపాడుతోంది. నిబంధనలు గాలికి వదలి పెట్టి జగన్మోహన్ రెడ్డి అడిగినదే తడవుగా గానుగకు చెరకు అందించినట్లు అప్పులు మంజూరు చేస్తోంది. ఫలితంగా రాష్ట్ర ప్రగతి పాతిక సంవత్సరాలు వెనక్కి పోయింది. ఇందులో జగన్మోహన్ రెడ్డికి ఎంత పాపముందో బీజేపీకి అంతే భాగ స్వామ్యముంది. అందుకే కాబోలు చంద్రబాబు నాయుడు కూడా పొత్తుల గురించి మౌనం పాటిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా వున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సముచితంగా ఆలోచించి బీజేపీని దూరంగా పెట్టి వామపక్షాలతో ఎన్నికలకు వెళ్లితే ఈ పదేళ్ల కాలంలో రాష్ట్రానికి బీజేపీ చేసిన మహా పాపమంతా జగన్మోహన్ రెడ్డి తన ఖాతాలో వేసుకోవలసి ఉంటుంది. లేకుంటే ఆ పాపమంతా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ మోయ వలసివుంటుంది.

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

ఎవరి దారి వారిదే...

అయోధ్యలో మోదీ... విపక్ష నేతలు?

న్యూఢిల్లీ: అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరవుతుండగా, ఈ కార్యక్రమానికి ఆహ్వానాలు అందిన వారు, అందని వారి నుంచి సానుకూల, ప్రతికూల స్పందనలు వెలువడుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం 22న అయోధ్యలో మోదీ ఉంటారు. విపక్ష పార్టీల నేతలు ఎక్కడ ఉండబోతున్నారు? ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న ఈ క్రతువును రాజకీయ కార్యక్రమంగా భావిస్తున్న ఆ పార్టీ నేతలు ఆరోజు ఏమి చేయబోతున్నారు? అనే ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.

రామాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానితుల జాబితా 10,000కు మించినట్లు చెబుతున్నారు. సొంత రాష్ట్రంలో ఈవెంట్ కావడంతో బీజేపీ నుంచి ఒక్క యూపీ ముఖ్యమంత్రికి మాత్రమే ఆహ్వానం అందింది. సీనియర్ విపక్ష నేతల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అయోధ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి దూరంగా ఉండబోతున్నారు. విపక్ష 'ఇండియా' కూటమికి చెందిన మెజారిటీ నేతలు దీనిని రాజకీయ కార్యక్రమంగానే చూస్తున్నట్టు ప్రకటించారు. ఇది 'నరేంద్ర మోదీ ఫంక్షన్' అని రాహుల్ తెగేసి చెప్పగా, దీనిని మతపరంగా విభజించే ప్రయత్నంగా మమతా బెనర్జీ అభిప్రాయపడుతున్నారు. కాగా, ఎన్‌సీపీ అధినేతశరద్ పవార్, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే అయోధ్య ఆహ్వానాన్ని తోసిపుచ్చారు. అసంపూర్తిగా ఉన్న ఆలయాన్ని ఓటు బ్యాంకుగా మలుచుకునేందుకే ప్రాణప్రతిష్ఠ తలపెట్టినట్టు వారు విమర్శిస్తున్నారు. ఇదే సమయంలో అయోధ్యలో ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టు కనిపించకుండా ఉండేందుకు 22వ తేదీనే ప్రత్యామ్నాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు విపక్ష నేతలు సిద్ధమవుతున్నారు. అయోధ్యలో ప్రతిష్ఠాపన జరిగే రోజే మమతా బెనర్జీ కోల్‌కతాలో కాళీఘాట్ పర్యటన చేపడుతున్నారు. అనంతరం 'మతసామరస్య ర్యాలీ'కి సారథ్యం వహిస్తారు. మతమనేది వ్యక్తిగత అంశమని, దాన్ని రాజకీయం చేయరాదని ఆమె చెబుతున్నారు. కాగా, 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో ఉన్న రాహుల్ గాంధీ 22న అసోంలో పర్యటన సాగిస్తారు. ఆరోజు కార్యక్రమంలో భాగంగా ఆయన ఆలయాలు సందర్శిస్తారు. శరద్ పవార్, అఖిలేశ్ యాదవ్... తాము అయోధ్యకు తర్వాత వెళ్తామని ప్రకటించారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత అయోధ్యకు వెళ్లడం సులువుగా ఉంటుందని, అప్పటికి రామాలయ నిర్మాణం పూర్తవుతుందని శరద్ పవార్ చెప్పారు. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఇప్పటి వరకూ అయోధ్య ఆహ్వానం అందలేదు. దీంతో ఆయన దిల్లీ వ్యాప్తంగా 'సుందరకాండ', 'హనుమాన్ చాలీసా' కార్యక్రమాలు ప్రకటించారు. మరోవైపు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు అయోధ్య నుంచి ఆహ్వానం రాలేదు. ఆరోజు తాను కాలారామ్ ఆలయాన్ని దర్శించి, మహాహారతిలో పాల్గొంటానని ఆయన ప్రకటించారు.

లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి అయోధ్యకు వెళ్తానని, ప్రాణప్రతిష్ఠకు హాజరుకాకపోవడానికి కారణంపై ట్రస్టు సభ్యుడు చంపత్ రాయ్‌కి లేఖ రాస్తానని చెప్పారు. ఎన్నికలకు ముందు ప్రజల దృష్టి మళ్లించేందుకే అయోధ్య ఈవెంట్‌ను బీజేపీ హైజాక్ చేసిందని ఇప్పటికే ఆరోపించిన డీఎంకే పార్టీ 22వ తేదీ ఈవెంట్‌కు దూరంగా జరిగింది. మతవిశ్వాసాలను తాము గౌరవిస్తామని, కానీ మతపరమైన కార్యక్రమాలను రాజకీయం చేయడం ఇష్టపడమని వామపక్ష నేతలు ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ జగన్నాథ్ హెరిటేజ్ కారిడార్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

మేయర్ ఎన్నిక వేళ కాంగ్రెస్, ఆప్, బీజేపీ నేతల ఘర్షణ

చండీగఢ్: చండీగఢ్‌లో మేయర్ ఎన్నికలు జరగనున్న వేళ స్థానిక నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీకి చెందిన కార్యకర్తలు ఒకరిపై మరొకరు దాడికి దిగారు. వివరాల్లోకి వెళితే.. జనవరి 18న జరిగే స్థానిక ఎన్నికలపై విపక్ష కూటమి 'ఇండియా'లోని కాంగ్రెస్, ఆప్‌లు తొలుత ఏకాభిప్రాయానికి వచ్చాయి. సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు కాంగ్రెస్ అభ్యర్థులు పోటీపడనున్నారు. పార్టీల నిర్ణయం మేరకు తాను మేయర్ పదవి కోసం వేసిన నామినేషన్‌ను విరమించుకునేందుకు కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్ జస్బీర్ సింగ్ బంటి మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఈ క్రమంలోనే అక్కడికి బంటి తండ్రి చేరుకున్నారు. బీజేపీకి మద్దతు ఇచ్చే ఆయన... తన కుమారుడిని కాంగ్రెస్ నేతలు కిడ్నాప్ చేశారని ఆరోపిస్తూ బంటిని తన వెంట పంపించాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలతో అక్కడున్న కాంగ్రెస్, ఆప్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. సమాచారం అందుకున్న పోలీసులు కార్యాలయం వద్దకు చేరుకొని పరిస్థితిని అదుపు చేసి బంటిని అతని ఇంటికి పంపించారు. అనంతరం బంటి స్పందిస్తూ... తాను ఎప్పటికీ కాంగ్రెస్‌తోనే ఉంటానంటూ వీడియో సందేశం పంపారు.

ర్యాలీల్లో ద్వేషపూరిత ప్రసంగాలను నివారించండి

యవత్మల్, రాయ్‌పూర్ కలెక్టర్లకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: హిందూ జనజాగృతి సమితి, తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే టీ రాజాసింగ్ ఓ వారం పాటు నిర్వహించనున్న ర్యాలీల్లో ద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా చూడాలని మహారాష్ట్రలోని యవత్మల్, చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్‌లను సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. అయితే న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ర్యాలీలను నిలిపివేస్తూ 'స్టే' ఇవ్వడానికి నిరాకరించింది. ప్రతిపాదిత ర్యాలీలు జరిగే ప్రదేశంలో ద్వేషపూరిత ప్రసంగాలు చేసేవారిని గుర్తించేందుకు వీలుగా రికార్డింగ్ సౌకర్యంతో కూడిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రెండు జిల్లాల డీఎంలు, ఎస్పీలకు ధర్మాసనం సూచించింది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, హింసను ప్రేరేపించకుండా చూసుకోవాలని ఆదేశించింది. ఇటువంటి కార్యక్రమాలలో ద్వేషపూరిత ప్రసంగాల సందర్భాలను హైలైట్ చేస్తూ జర్నలిస్టు షాహీన్ అబ్దుల్లా పెండింగ్‌లో

ఉన్న పిటిషన్‌పై పంపిన దరఖాస్తుపై ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 18న యవత్మాల్‌లో హిందూ జనజాగృతి సమితి ర్యాలీ నిర్వహించనుందని, అక్కడ జరుగుతున్న ద్వేషపూరిత ప్రసంగాలపై అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన వివాదాస్పద బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ జనవరి 19 నుండి జనవరి 25 వరకు చత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరిగే ర్యాలీల్లో ప్రసంగించబోతున్నారని ఆయన అన్నారు. సింగ్ ర్యాలీలలో కూడా ద్వేషపూరిత ప్రసంగాలు జరుగుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అబ్దుల్లా తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, న్యాయవాది నిజాం పాషా వాదిస్తూ... తమ ప్రసంగాల ద్వారా సమాజంలో విద్వేషాన్ని పెంచే వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అయితే "కచ్చితంగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయబడ్డాయి. కానీ కొన్ని చర్యలు తీసుకోబడ్డాయి. వారు (పోలీసులు) ఎఫ్ఐఆర్ నమోదు చేసారు" అని జస్టిస్ ఖన్నా చెప్పారు. 'ఏం చర్యలు తీసుకున్నారు? ఏమీ లేదు... ఇప్పుడు వారు మరో ర్యాలీని నిర్వహించబోతున్నారు' అని సిబల్ బదులిచ్చారు. కాగా అక్కడ ద్వేషపూరిత ప్రసంగాలు జరిగే అవకాశం ఉందన్న భయంతో ర్యాలీని ముందస్తుగా నిలిపివేయలేమని ధర్మాసనం పేర్కొంది. కానీ హింసను ప్రేరేపించే విధంగా ఉంటే కోర్టు చర్యలు తీసుకోవచ్చని తెలిపింది.

బంగళా ఖాళీ చేస్తారా... చేయించాలా!

- మహువాకు కేంద్రం మూడో నోటీసు
- దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన తృణమూల్ నేత

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మెయిత్రాకు ప్రభుత్వ బంగళా ఖాళీ చేయాలని కేంద్రం మూడవ నోటీసులను బుధవారం పంపింది. మీకు మీరుగా బంగళా ఖాళీ చేస్తే సరి... లేదంటే బలవంతంగా ఖాళీ చేయించాల్సి ఉంటుందని అందులో పేర్కొంది. బంగళాను ఖాళీ చేసి, దానిని వెంటనే అప్పగించండి అని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ అధికారులు ఆదేశించారు. ఈనెల 8, 11 తేదీల్లోనూ ఆమెకు నోటీసులు అందాయి. దీంతో మహువా... దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఇదే బంగళాలో ఉండేందుకు అనుమతివ్వాలని గతంలో హైకోర్టును ఆశ్రయిస్తే ఆ మేరకు అధికారులకు విజ్ఞప్తి చేసుకోమని కోర్టు సూచించింది. తాజా నోటీసులపై మహువా మళ్లీ హైకోర్టు తలుపు తట్టారు. తృణమూల్ కాంగ్రెస్ తరఫున పార్లమెంటుకు ఎన్నికైన మహువా మొయిత్రాపై ఇటీవల వేటు పడింది. పార్లమెంటు సభ్యుల లాగిన్ వివరాలను బయట వారితో పంచుకోవడమే కాకుండా లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు ముడుపులు పొందినట్లు ఆమెపై ఆరోపణలున్నాయి. ప్రాథమిక ఆధారాలు పరిశీలించిన పార్లమెంటు... ఈ వ్యవహారాన్ని విచారించేందుకు ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా మహువా మొయిత్రా సభ్యత్వాన్ని రద్దు చేస్తూ లోక్‌సభ స్పీకర్ గతేడాది డిసెంబరు 8న ఆదేశలిచ్చారు. సస్పెన్షన్‌పై ఆమె న్యాయపోరాటం చేస్తున్న క్రమంలో ఎంపీగా తనకు కేటాయించిన బంగళాలో ఉండేందుకు అనుమతించాలని అధికారులను ఆదేశించాలని కోరుతూ ఆమె దిల్లీ హైకోర్టుకు విన్నవించారు.

తమిళనాట జల్లికట్టు

శివగంగలో ఇద్దరి మృతి, 70 మందికి గాయాలు

శివగంగ: పొంగల్ పండుగను పురస్కరించుకొని తమిళనాడులో సంప్రదాయం ప్రకారం జల్లికట్టు పోటీలు నిర్వహించారు. శివగంగ జిల్లాలో జరిగిన పోటీలో మైనర్ సహా ఇద్దరు మరణించారు. మరో 70 మంది గాయాలయ్యాయి. మృతుల్లో ఒకరిని వలయంపాటికి చెందిన రవి (11)గా గుర్తించారు. జిల్లా కలెక్టర్ ఆశా అజిత్, ఎంపీ కార్తీ చిదంబరం, డీఎంకే మంత్రి పెరియకరుప్పన్ అధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో 186 ఎద్దులు, 81 మంది వ్యక్తులు పాల్గొన్నారు. పోటీ సమయంలో అవాంచిత ఘటనలు చోటుచేసుకోలేదు. అయితే యజమానులు తమ ఎద్దులను పట్టుకునేందుకు ప్రయత్నించగా అవి పరుగులు తీశాయి. దీంతో తొక్కిసలాట జరిగింది. రాష్ట్రంలో ఇతర ప్రాంతంల్లోనూ జల్లికట్టు పోటీల్లో కొందరికి గాయాలయ్యాయి. మదురై జిల్లాలోని పాలమేడు వద్ద 60 మంది గాయపడ్డారు.

రాహుల్ యాత్రలో చేరను: అఖిలేశ్

లక్నో: రాహుల్ గాంధీ నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో తాను చేరే అవకాశం లేదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దీనిపై యాదవ్‌ను ప్రశ్నించగా... కాంగ్రెస్ లేదా బీజేపీ తమ కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించడం లేదని బదులిచ్చారు. పార్టీ కార్యాలయం నుంచి ఆయన 'సంవిధాన్ బచావో, దేశ్ బచావో సమాజ్‌వాదీ పీడీఏ యాత్ర'ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... ఈ యాత్ర డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్, డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా, ములాయం సింగ్ యాదవ్‌ల సిద్ధాంతాలను గ్రామాలకు వ్యాపింపజేస్తుందని అన్నారు. పాతతరం సోషలిస్టుల కలలను నెరవేర్చేందుకు తాము ప్రతిజ్ఞ చేశామని, రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో యాత్ర సాగుతుందన్నారు. వెనుకబడిన వారు, దళితులు, మైనారిటీలు, అగ్రవర్ణాలను కలిపే ప్రయత్నం చేస్తామని ఆయన తెలిపారు. రాజ్యాంగ విలువలను, రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాడుతున్న ఏకైక పార్టీ సమాజ్‌వాదీ పార్టీయేనని చెప్పుకొచ్చారు. రాహుల్ యాత్ర ఫిబ్రవరి 14న ఉత్తరప్రదేశ్‌కు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షుడు అజయ్ రాయ్ తెలిపారు. యాత్ర రాష్ట్రంలో 11 రోజులపాటు సాగే యాత్ర... ప్రధాని నరేంద్ర మోదీ నియోజకవర్గం వారణాసి, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నియోజకవర్గం రాయ్‌బరేలీ, ప్రస్తుతం కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ మాజీ నియోజకవర్గం అమేథీ గుండా వెళుతుంది. మొత్తంగా యూపీలోని 20 జిల్లాల్లో 1,074 కి.మీ. పాటు న్యాయ యాత్ర సాగనుంది. కాగా సార్వత్రిక ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌తో ఎస్పీ పొత్తు పెట్టుకుంటుందా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు.

సత్వరాభివృద్ధిపై నిరూపిత ట్రాక్ రికార్డు బీజేపీదే: మోదీ

కొచ్చి: భారత్‌లో సత్వర అభివృద్ధి, భవిష్యత్తుపై స్పష్టమైన దృక్పథంతో పాటు నిరూపిత ట్రాక్ రికార్డు కలిగి ఉన్న ఏకైక పార్టీ బీజేపీ అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇక్కడి మెరైన్ డ్రైవ్‌లో బుధవారం రెండు నుంచి మూడు బూత్ స్థాయి ప్రాంతాలతో కూడిన 'శక్తి కేంద్రాల'కు చెందిన దాదాపు 6వేల మంది పార్టీ ఇన్‌ఛార్జ్‌లతో జరిగిన సమావేశంలో ప్రధాని మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. ఓ నివేదిక ప్రకారం దేశంలో గత తొమ్మిదేళ్లలో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుండి బయట పడ్డారని ఆయన చెప్పారు. 'దేశాభివృద్ధి కోసం మనం తీసుకున్న దిశ సరైనదని ఇది సూచిస్తుంది' అని ప్రధాని అన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ట్రాక్ రికార్డ్ అవినీతి చరిత్రకు పర్యాయపదమని ప్రజలకు తెలియజేయాలని పార్టీ కార్యకర్తలను ప్రధాని కోరారు. రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా మంగళవారం తనకు లభించిన ఘన స్వాగతం గురించి కూడా మోదీ ప్రస్తావించారు. కేరళ ప్రజలు తనపై చూపుతున్న ప్రేమ, ఆప్యాయతకు తాను అమితానందంగా ఉన్నానన్నారు. మంగళవారం కొచ్చికి వచ్చిన తనను ప్రజలు ఆశీర్వదించారని, ఈ ఉదయం త్రిప్రయార్ శ్రీరామస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో కూడా ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు.

రూ.4వేల కోట్ల ప్రాజెక్టుల ప్రారంభం

కేరళలో 4 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులు... దక్షిణాది అభివృద్ధి వేగవంతానికి దోహదం చేస్తాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన 310 మీటర్ల పొడవైన డ్రైడాక్, అంతర్జాతీయ షిప్ మరమ్మతుల కేంద్రం (ఐఎస్ఆర్ఎఫ్)ను మోదీ ప్రారంభించారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్-(ఐఓఎల్)కు చెందిన ఎల్‌పీజీ ఇంపోర్ట్ టెర్మినల్‌ను జాతికి అంకితం చేశారు. అంతర్జాతీయ వ్యాపారానికి భారత్ అతిపెద్ద కేంద్రంగా మారుతోందని ఈ సందర్భంగా మోదీ తెలిపారు. ఈ నేపథ్యంలో దేశ తీరప్రాంతాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. రెండు రోజుల కేరళ పర్యటనలో ఉన్న ప్రధాని బుధవారం సాయంత్రం దిల్లీకి తిరిగి రానున్నారు.

సురేశ్‌గోపి కుమార్తె వివాహానికి మోదీ

మలయాళ నటుడు, బీజేపీ నేత సురేశ్ గోపి కుమార్తె వివాహానికి మోదీ హాజరయ్యారు. కేరళ పర్యటనలో ఉన్న ఆయన... కొచ్చిలో రోడ్ షో చేపట్టిన అనంతరం త్రిస్సూర్ వచ్చారు. గురువాయూర్ ఆలయంలో కొత్త జంటను ఆశీర్వదించి వారిద్దరికీ వరమాలలు అందించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు మీడియాలో దర్శనమిచ్చాయి. సురేశ్ గోపి కుటుంబం, కొత్త జంటతో మాట్లాడిన మోదీ... వారితో ఫొటోలు తీసుకున్నారు. ఈ వేడుకలో మోహన్‌లాల్, మమ్ముట్టి, తదితర మలయాళ నటులు సందడి చేశారు. వారితోనూ ప్రధాని ముచ్చటించారు. మరో 30 జంటలను ఆశీర్వదించారు. వధువు భాగ్య సురేశ్... సురేశ్ గోపి పెద్ద కుమార్తె. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం ప్రధాని గురువాయూర్‌లోని కృష్ణుడి ఆలయంలో పూజలు చేశారు. దానికి సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో షేర్ చేశారు. వాటిలో ఆయన సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. ప్రతి భారతీయుడి సుఖసంతోషాల కోసం పూజలు చేసినట్లు వెల్లడించారు. ప్రధాని రాకతో ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత కనిపించింది. హెలిప్యాడ్ వద్దకు భారీసంఖ్యలో మద్దతుదారులు రావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా కనిపించింది. కొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో మోదీ దక్షిణాది రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించారు. నిన్న కొచ్చిలో రోడ్‌షోలో పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు.

మేనిఫెస్టోపై కాంగ్రెస్ కసరత్తు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పార్టీ మేనిఫెస్టోలో ఎలాంటి అంశాలు చేర్చాలనే విషయంపై కసరత్తు చేస్తోంది. దీని రూపకల్పనలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చింది. మేనిఫెస్టో రూపొందించేందుకు ఏర్పాటుచేసిన కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. కమిటీ సభ్యులు ప్రతి రాష్ట్రంలోని ప్రజలతో సంప్రదింపులు జరిపి సూచనలు సేకరిస్తారని ఆయన తెలిపారు. ఇది ప్రజల మేనిఫెస్టో అని అన్నారు. సూచనల కోసం ఈ మెయిల్, ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు చిదంబరం వెల్లడించారు. వీటి ద్వారా దేశవ్యాప్తంగా వీలైనంత ఎక్కువమంది నుంచి సూచనలు స్వీకరిస్తామన్నారు. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందించారు. కాంగ్రెస్ కేవలం పార్టీ కాదు. ప్రజల గొంతుక. టాప్- డౌన్ విధాన రూపకల్పనను విశ్వసించదు. సామాన్యుల ఆకాంక్షలకు అనుగుణంగా వారి అభివృద్ధికి ఉపయోగపడే విధానాలు తీసుకువస్తుంది. మేనిఫెస్టో ఎలా ఉండాలో సూచనల ద్వారా తెలియజేయండని పోస్టు పెట్టారు.

మాజీ సీఎం హుడాను ప్రశ్నించిన ఈడీ అధికారులు

న్యూఢిల్లీ: హరియాణా మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూపిందర్ సింగ్ హుడాను బుధవారం ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) ప్రశ్నించింది. 2004-07 మధ్య కాలంలో మనేసర్ భూసేకరణలో జరిగిన అక్రమాలకు సంబంధించి మనీలాండరింగ్ కేసు విచారణలో భాగా హుడాను ప్రశ్నించినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) నిబంధనల ప్రకారం 76 ఏళ్ల హుడా వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేసింది. ఈ కేసు మనేసర్‌లో 2004, 2007 మధ్య కాలంలో సీనియర్ ప్రభుత్వ అధికారులు, బ్యూరోక్రాట్ల సహకారంతో అక్రమ భూ సేకరణకు సంబంధించినది.ఈ కేసులో దాదాపు రూ.1500 కోట్ల మేర మోసం జరిగిందని రైతులు, భూ యజమానులు ఆరోపించారు. హరియాణా పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా 2016 సెప్టెంబర్‌లో ఈడీ పీఎంఎల్ఏ కేసును నమోదు చేసింది.

'ఇండియా' సీట్ల సర్దుబాటులో జాప్యం: లాలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష 'ఇండియా కూటమి' మధ్య సీట్ల పంపకాల వ్యవహారం కొలిక్కి రావడం అంత తేలిక కాదని ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ చెప్పారు.ఇందుకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. జేడీయూ అధ్యక్షుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌తో ఆర్‌జేడీ తెగతెంపులు వదంతులను ఆయన కొట్టిపారేశారు. బుధవారం ఇక్కడ మీడియాతో లాలు మాట్లాడుతూ కూటమిగా ఏర్పడిన తర్వాత భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకం వ్యవహారం అనేది అంత త్వరగా జరిగే వ్యవహారం కాదని, అందుకు తగిన సమయం పడుతుందని చెప్పారు. కాగా, జనవరి 22న అయోధ్య రామాలయంలో జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి తాను వెళ్లడం లేదని లాలూ ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఇందుకు కారణాన్ని తెలియజేస్తూ రామాలయం ట్రస్టు సభ్యుడు చంపత్‌రాయ్‌కి లేఖ రాస్తానన్నారు.

మణిపూర్‌లో మిలిటెంట్ల దాడి...కమాండో మృతి

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. భారత్-మైన్మార్ సరిహద్దుల్లోని మోరేలో భద్రతా బలగాల పోస్ట్‌పై మిలిటెంట్లు దాడి చేశారు. బాంబులు, రాకెట్ ఆధారిత గ్రనేడ్లు విసిరారు. ఈ ఘటనలో ఓ పోలీసు కమాండో మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో కమాండో పోస్ట్ వద్దనున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. మిలిటెంట్ల దాడిని భద్రతా దళాలు తిప్పికొట్టాయి. ఇటీవల మోరే ప్రాంతంలో ఓ పోలీసు అధికారి హత్యకు గురయ్యారు. ఆ కేసులో ఇద్దరు అనుమానితులను అరెస్టు చేశారు. దీంతో రెండు రోజుల క్రితం కుకీ గ్రూప్‌లు పెద్దఎత్తున ఆందోళన చేపట్టాయి. మోరే నుంచి రాష్ట్ర పోలీసులను పంపించాలని డిమాండ్ చేశాయి. ఈ ఆందోళనలు జరిగిన రోజుల వ్యవధిలోనే తాజాగా కమాండ్ పోస్ట్‌పై దాడి జరగడం గమనార్హం. ఈ దాడికి పాల్పడింది కుకీ మిలిటెంట్లేనని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా గతేడాది మణిపూర్‌లో కొన్ని నెలల పాటు తీవ్ర ఘర్షణలు చెలరేగిన విషయం తెలిసిందే. ఆ హింసాత్మక ఘటనల్లో 180 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొంటున్న వేళ... మళ్లీ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

థరూర్ విమర్శలకు సింధియా కౌంటర్

న్యూఢిల్లీ: ఉత్తరాదిలో నెలకొన్న పొగమంచు వల్ల విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పదుల సంఖ్యలో విమానాలు రద్దవుతుండటంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఈ పరిస్థితి రాజకీయ విమర్శలకు దారితీసింది. దీనిపై పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మధ్య మాటల యుద్ధం నడిచింది. విమానాల ఆలస్యం, ఇతర సమస్యలపై థరూర్ కొన్ని నివేదికలను షేర్ చేయగా మంత్రి వాటికి సమాధానం ఇచ్చారు. ఇంటర్నెట్ ఎంపిక చేసిన కొన్ని కథనాలను షేర్ చేయడం పరిశోధన కిందకు రాదని, శశిథరూర్, కాంగ్రెస్ ఐటీ సెల్ కోసం వాస్తవాలు వెల్లడిస్తున్నానని, పౌర విమానయానం వంటి సాంకేతిక రంగాలపై వారి అవగాహన లోపాన్ని అధిగమించడానికి అవి సహాయపడతాయని థరూర్‌కు మంత్రి సింధియా సమాధానం చెప్పారు. కేంద్రం తీసుకుంటున్న చర్యలు, కల్పిస్తోన్న సదుపాయాల గురించి వెల్లడించారు.

విమాన టాయిలెట్‌లో 100 నిమిషాలు

బెంగళూరు: విమానంలో ఓ ప్రయాణికుడికి చేదు అనుభవం ఎదురైంది. విమానం బయలుదేరగానే టాయిలెట్ రూమ్‌కు వెళ్లిన అతడు అందులోనే చిక్కుకుపోయాడు. ఈ ఘటన స్పైస్‌జెట్ విమానంలో మంగళవారం చోటుచేసుకొంది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌జీ 268 విమానం ముంబై నుంచి బెంగళూరు బయలుదేరింది. టేకాఫ్ అయిన కాసేపటికే ప్రయాణికుడు టాయిలెట్ రూమ్‌కు వెళ్లాడు. డోర్ తెరుచుకోకపోవడంతో బయటకు రాలేక భయాందోళనకు గురయ్యాడు. సమాచారం అందుకున్న సిబ్బంది తలుపు తెరిచేందుకు తీవ్రంగా యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అతడు దాదాపు 100 నిమిషాల పాటు టాయిలెట్‌లోనే ఉండాల్సి వచ్చింది. విమానం బెంగళూరు విమానాశ్రమయంలో దిగిన అనంతరం ఇంజినీర్లు వచ్చి తలుపు పగలగొట్టి ప్రయాణికుడిని రక్షించారు. అనంతరం అతడికి ప్రథమ చికిత్స అందించారు. ఈ ఘటనపై స్పైస్‌జెట్ స్పందించింది. డోర్ లాక్‌లో లోపం కారణంగా అతడు చాలా సేపు టాయిలెట్‌లోనే ఉన్నాడు. సిబ్బంది ప్రయాణికుడికి అన్ని విధాలుగా సహకరించారు. అతడిని బయటకు తీసుకొచ్చిన వెంటనే వైద్య సహాయం అందించామని సంస్థ ప్రతినిధి తెలిపారు.

కార్లు దూసుకెళ్లి...శరీర భాగాలు ఛిద్రం

న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేస్తోంది. దాంతో ఎదురుగా వస్తున్న వ్యక్తులు, వాహనాలు కనిపించడం లేదు. ఇదే దిల్లీలో ఘోర ఘటనకు దారితీసింది. రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని గుర్తించలేని వాహనదారులు వేగంగా వెళ్లడంతో ఆ మనిషి శరీరం ఛిద్రమైంది. శరీర భాగాలన్నీ రహదారిపై చిందరవందరగా పడిపోయాయి. దాంతో ఆ వ్యక్తి ఎవరో గుర్తుపట్టలేని పరిస్థితి నెలకొంది. కనీసం మహిళా, పురుషుడా అనేది కూడా తెలియట్లేదని పోలీసులు చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం దేశ రాజధానిలో మంగళవారం ఉదయం పారిశుధ్య కార్మికులు రహదారులు శుభ్రం చేస్తుండగా చెల్లాచెదురుగా పడి ఉన్న శరీరభాగాలు కన్పించాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వాటిని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. సీసీటీవీ దృశ్యాల ద్వారా ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ప్రాథమికంగా కొన్ని వివరాలు వెల్లడించారు. ఆ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వేగంగా వెళ్తున్న వాహనం ఢీకొట్టి ఉండొచ్చని చెప్పారు. ఆ తర్వాత వరుసగా వాహనాలు వెళ్లడంతో ఈ ఘోరం జరిగి ఉండొచ్చని అంచనా వేశారు. అయితే పొగమంచు వల్ల మొదట ఢీకొన్న వాహనాన్ని గుర్తించడం కష్టంగా మారిందని చెప్పారు.

నిరంతర శ్రమజీవి సూరపనేని

సంస్మరణ సభలో రామకృష్ణ నివాళి

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్: అందరితో కలివిడిగా ఉండే సూరపనేని రాధాకృష్ణ మూర్తి నిరంతర శ్రమజీవి అని, విద్యలేకపోతే భవిష్యత్ ఉండదని గుర్తించి... తాను కడుపేదరికంలో కొట్టుమిట్టాడుతు న్నప్పటికీ తన పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది సమాజసేవ చేయడాన్ని అలవర్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ కొనియాడారు. వృద్ధాప్య కారణాలతో ఈ నెల 5వ తేదీన కన్నుమూసిన సూరపనేని రాధాకృష్ణమూర్తి (85) సంస్మరణ సభ బుధవారం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం సాగారం గ్రామంలో రైతు సంఘం నాయకులు కొమ్మన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తొలుత రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకర సుభాశ్ చంద్రబోస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ తదితరులు రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ... రాధాకృష్ణమూర్తి జీవితం ఆదర్శనీయమన్నారు. పిల్లలను ఉన్నతులుగా, సమాజసేవకులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అమెరికాలో నివాసంలో ఉండే రాధా కృష్ణమూర్తి కుమారుడు ఉమామహేశ్వరరావుతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. రాజకీయాలతో ఆయనకు సంబంధాలు లేనప్పటికీ సీపీఐ జిల్లా నాయకులు మోదుమూడి రామారావు కుమార్తె శిరీషను వివాహమాడిన తర్వాత కమ్యూనిస్టు రాజకీయాలు అలవర్చుకున్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చేదోడువాదోడుగా ఉండడంతో పాటు సమాజసేవా కార్యక్రమాలు విస్తృతంగా చేయడం అభినందనీయమన్నారు. సుభాశ్ చంద్రబోస్ మాట్లాడుతూ... రాధాకృష్ణమూర్తి ఎకరం పొలం సాగు చేస్తూ సంసారం వెళ్లదీస్తూ కొడుకు, కూతురుని చదివించారని చెప్పారు. పిల్లలు కూడా కష్టపడి చదివి పైకొచ్చారన్నారు. రాధాకృష్ణమూర్తి కుమారుడు ఉమామహేశ్వరరావు అమెరికా వెళ్లడం, ఆయన సోదరి పిల్లలు విదేశాలకు వెళ్లడం ద్వారా మారుమూల పల్లె సాగారం పేరును ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. రాధాకృష్ణమూర్తి నిరంతర శ్రమజీవి అని, ఆయన మృతితో సాగారం ఆణిముత్యం రాలిపోయిందని నివాళి అర్పించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ... విద్యలేకపోతే భవిష్యత్ ఉండదని గుర్తించడం వల్లే రాధాకృష్ణమూర్తి తన పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని చెప్పారు. సామాజిక సేవలో పాలుపంచుకునే విధంగా ప్రోత్సహించారన్నారు. ఆ ప్రోత్సాహంతోనే ఉమామహేశ్వరరావు సీపీఐ కార్యకలాపాలకు చేదోడువాదోడుగా ఉండటంతో పాటు సామాజిక సేవ చేస్తున్నారని చెప్పారు. అక్కినేని వనజ మాట్లాడుతూ... రాధా కృష్ణమూర్తి, ఆయన సంతానం వారి కష్టంతో వారే పైకొచ్చారన్నారు. డల్లాస్‌లోని ఉమామహేశ్వరరావు, శిరీష దంపతుల ఇల్లు భారత్ నుంచి వెళ్లిన వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర కాముకులకు ఒక కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. రైతుసంఘం నాయకులు వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ... అన్నీఉన్నా అణిగిమణిగి ఉండడమనేది ఉమామహేశ్వరరావు నుంచే నేర్చుకోవా లన్నారు. అమెరికాలో ఉంటున్నప్పటికీ మారుమూల పల్లెలో ఉన్న తల్లిదండ్రుల అవసరాలన్నింటినీ ఎప్పటి కప్పుడు తీరుస్తూ, వారికి అవసరమైన వైద్యసేవలు అందేలా చూసిన తీరు అభినందనీయమన్నారు. సీపీఎం నాయకులు ముప్పవరపు రామారావు మాట్లాడుతూ... రాధాకృష్ణమూర్తి జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. స్నేహానికి ఆయన ప్రాణమిచ్చేవారన్నారు. సభలో ఇంకా ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు అక్కినేని చంద్రరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నార్ల వెంకటేశ్వరరావు, రామకృష్ణ సతీమణి సుజాత ఆర్‌కే, మహిళా సమాఖ్య నాయకులు పమిడిముక్కల రాణి, లక్ష్మీనారాయణ, సీపీఐ మచిలీపట్నం ఏరియా నాయకులు ఎర్రంశెట్టి ఈశ్వరరావు, రాధాకృష్ణ సతీమణి సూరపనేని ఉదయకుమారి, సీపీఐ జిల్లా నాయకులు ఎం.రామారావు, తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. సీపీఐ నూజివీడు ఏరియా నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

జగన్ ప్రభుత్వానిది పైశాచికత్వం

అంగన్‌వాడీలను ఇబ్బంది పెడితే పతనమే: ఓబులేసు హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్‌వాడీ కార్మికులను ఏడిపిస్తూ పైశాచిక ఆనందాన్ని జగన్ ప్రభుత్వం పొందుతోందని ఏఐటీయూసీ ఏపీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకుండా మొండిగా వ్యవహరిస్తోందని అన్నారు. అదానీ కోరితే గంగవరం, కృష్ణపట్నం రేవులనుఅప్పగిస్తున్న ముఖ్యమంత్రికి లక్ష మంది అంగన్‌వాడీల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. ఎస్మా పేరుతో లక్ష మంది జీవనోపాధికి ఎసరు పెట్టాలని చూస్తే అది జగన్ ప్రభుత్వ రాజకీయ వినాశనానికి దారితీస్తుందని హెచ్చరించారు. 'జయలలిత సర్కారుకు ఏ గతి పట్టిందో తెలియదేమో! జగన్ కంటే రెండు దశాబ్దాలకు ముందే అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన చంద్రబాబుకు ఏం జరిగిందో తెలుసుకుంటే మంచిది' అని హితవు పలికారు. అంగన్‌వాడీల నిరవధిక నిరాహార దీక్షల ప్రారంభం సందర్భంగా విజయవాడ ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసిన సభలో ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో 10,04,000 మంది అంగన్‌వాడీలు 37 రోజులుగా సమ్మె చేస్తున్నారని, వారికి 30 లక్షల మంది లబ్ధిదారుల మద్దతు ఉందన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, నేటి నవ్యాంధ్ర ప్రదేశ్‌లోనూ అంగన్‌వాడీ రంగానికి చెందిన మహిళా శ్రామికవర్గం అనేక పోరాటాలు చేసింది కానీ సుదీర్ఘ సమ్మె ఇప్పటి వరకు జరగలేదన్నారు. ఎస్మా ప్రయోగించి 12 రోజులైందని ఓబులేసు గుర్తుచేశారు. ఈనెల 12వతేదీ చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక వైఖరి చేపట్టి, బెదిరింపులకు దిగిందని విమర్శించారు. సమ్మె అణచివేత కోసం పావులు కదుపుతోందని చెప్పారు. రోజుకు రూ.400 కూడా గిట్టని పేద మహిళా కార్మికులపై 'ఎస్మా' ప్రయోగం అన్యాయమని ఓబులేసు అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును గుజరాత్ ప్రభుత్వం అమలు చేసిందని, కర్నాటక ప్రభుత్వం గ్రాట్యూటీని అంగీకరిస్తూ జీవో ఇచ్చిందని గుర్తుచేశారు. అంగన్‌వాడీల సమస్యలపై సానుకూలంగా ఆలోచించి వాటిని పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెకు జేఏసీ తరుపున మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, కార్మికవర్గం దృఢంగా పోరాడాలన్నారు. దీక్షా శిబిరానికి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మంజుల, నాయకులు జి.భారతి, మమత, ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నర్సింగరావు, నాయకులు కె.ధనలక్ష్మి, ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నేతలు పి.గంగాభవాని, ఎ.రవిచంద్ర పాల్గొన్నారు.

పాక్‌లో కిలో చికెన్ రూ.615

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరుకుంది. నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏమి తినాలి... ఏమి కొనాలి తెలియక పస్తులు ఉంటున్నారు. ఓ వైపు రాజకీయ అస్థిరత మరోవైపు ఆర్థిక మాంద్యానికి తోటు ఆహార సంక్షోభం తోడవడంతో పాకిస్థాన్ ప్రజలకు పూట గడవడం కష్టమైంది. అంతర్జాతీయ సంస్థలు, వివిధ దేశాల నుంచి సాయం కోసం పాకిస్థాన్ ఎదురుచూసే పరిస్థితులు నెలకొన్నాయి. కిలో చికెన్ ధర రూ.615కు పెరుగగా, ఉల్లి ధర రూ.250కు చేరింది. అలాగే డజను కోడిగుడ్ల ధర రూ.400 దాటింది. అంటే ఒక్కో గుడ్డు రూ.33పైగా పలుకుతోంది. యంత్రాంగం వైఫల్యంతో అవస్థలు తప్పడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కిలో ఉల్లి ధరను రూ.175గా నిర్ణయించింది కానీ మార్కెట్లలో రూ.230 నుంచి రూ.250 వరకు పలుకుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుం డటంతో ఫలితాలపై ధరల ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జరుగుతోంది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్న వాదన లున్నాయి. ఇదిలావుంటే, పాక్ ఆర్థిక శాఖ నివేదిక ప్రకారం.. గతేడాది నవంబర్ చివరికి పాకిస్థాన్ రుణభారం రూ.63,399 లక్షల కోట్లకు పెరిగినట్లు తెలుస్తోంది.

మహనీయుల పేర్లు విలన్లకా?

దర్శకుడు త్రివిక్రమ్ చిత్రపటాలు దహనం చేసిన ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ: మహేష్ బాబు కథా నాయకుడిగా వచ్చిన గుంటూరు కారం సినిమాలో ప్రతినాయకుల(విలన్) పాత్రలకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు తీవ్రంగా ఖండించారు. అసభ్యకరంగా రాసిన మడత కుర్చీ బూతు పాటని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. గుంటూరు కారం సినిమాలో విలన్లకు లెనిన్, కార్ల్ మార్క్స్ పేర్లు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐవైఎఫ్ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో స్థానిక హనుమాన్ పేట కార్ల్ మార్క్స్, ఎంగెల్స్ విగ్రహాల వద్ద బుధవారం సినిమా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ చిత్ర పటాలు దహనం చేసి...నిరసన తెలిపారు. అనంతరం రాజేంద్రబాబు మాట్లాడుతూ త్రివిక్రమ్‌కు మతి భ్రమించిందని, ప్రపంచ కమ్యూనిస్టు అగ్రనేతల పేర్లను ఈ సినిమాలో విలన్ పాత్రలకు పెట్టి సమాజానికి తప్పుడు అవగాహన సంకేతాలివ్వడం అభ్యంతరకరన్నారు. కారల్ మార్క్స్ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేసిన మహా నేత అని, 'దాస్ కాపిటల్' రచించి ప్రపంచవ్యాప్తంగా శ్రామికవర్గాన్ని విముక్తి చేయడానికి తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. లెనిన్ మార్క్సిజంతో రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేశారని గుర్తు చేశారు. దోపిడీ, పీడన, అణచివేత లేని సోషలిస్టు సమాజాన్ని ఏర్పరిచిన ఈ మహనీయుల స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పేద ప్రజల విముక్తి కోసం పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని, అలాంటి మహానేతల పేర్లని విలన్ పాత్రధారులకు పెట్టి అవమానించడం తగదన్నారు. ఇదే సినిమాలో అసభ్యకరంగా రాసిన మడత కుర్చీ బూతు పాటను సినిమాలో పెట్టడాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. త్రివిక్రమ్, మహేష్ బాబు చేసిన ఈ ఘోర తప్పిదానికి బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పి...వీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా గుంటూరుకారం సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్ల ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు షేక్ నజీర్, భాషా, ఏఐవైఎఫ్ విజయవాడ నగర కార్యదర్శి లంకా గోవింద రాజులు, నగర ఉపాధ్యక్షుడు శీరం రవికుమార్, నాయకులు గుంజ క్రాంతి కుమార్, లంకె సాయి, ఎం.లాల్ మోహన్, శ్రీధర్, ఐతం ఆంజనేయులు, సింగంశెట్టి మోహన్ కుమార్, గాడి అజయ్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జైల్లో కోడికత్తి కేసు నిందితుడి ఆమరణ దీక్ష

విజయవాడలో దీక్ష చేస్తున్నట్లు తల్లి, సోదరుడి ప్రకటన

సీఎం జగన్ వాంగ్మూలం ఇచ్చి శ్రీనును విడిపించాలని డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం/విజయవాడ (గాంధీ నగర్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కోడికత్తి దాడి ఘటనలో నిందితుడిగా ఉన్న జనిపల్లి శ్రీనివాస్ అలియాస్ కోడికత్తి శ్రీను నిరాహారదీక్షకు సిద్ధమయ్యాడు. తన కేసులో సీఎం జగన్ కోర్టులో వాంగ్మూలం ఇవ్వాలన్న డిమాండ్‌తో విశాఖ సెంట్రల్ జైలులో గురువారం నుంచి నిరాహారదీక్ష చేయనున్నాడు. గత ఐదేళ్లుగా శ్రీనివాస్ రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అయితే జగన్ కోర్టులో వాంగ్మూలం ఇస్తే శ్రీనుకు బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ సీఎం జగన్ కోర్టుకు హాజరు కాకుండా జాప్యం చేస్తున్నారని ఆయన తరపు న్యాయవాది చెబుతున్నారు. మరో పక్క తమ కుమారుడు శ్రీను జైలులో నిరాహార దీక్షకు సిద్ధమయ్యాడని ఆయనకు మద్దతుగా తాము కుడా విజయవాడలో నిరవధిక నిరాహారదీక్ష చేపడుతున్నామని శ్రీనివాస్ తల్లి సావిత్రి, సోదరుడు సుబ్బరాజు తెలిపారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సోదరుడు సుబ్బరాజు మాట్లాడుతూ... తన కేసులో సీఎం జగన్ వాంగ్మూలం ఇవ్వాలన్న డిమాండ్‌తో రేపటి (గురువారం) నుంచి విశాఖ జైలులో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపాడని, ఆయనకు మద్దతుగా తాను తన తల్లి, తమతో కలిసొచ్చే ప్రజాసంఘాలు, దళిత సంఘాలను కలుపుకుని దీక్ష చేస్తామని, తమకు న్యాయం జరిగే వరకు విరమించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అనాడు తన సోదరుడిపై కేసు పెట్టి జగన్ ఎన్నికల్లో లబ్ధి పొంది జగన్ ముఖ్యమంత్రి అయ్యారని సుబ్బరాజు ఆరోపించారు. జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పడం లేదని, జడ్జిలు కూడా మాకు న్యాయం చేయడం లేదన్నారు. కేవలం దళిత పేద కుటుంబం కావటం వల్లే తమకు న్యాయం జరగటంలేదన్నారు. జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం అయినా ఇవ్వాలి లేకుంటే ఎన్‌ఓసీ అయినా ఇచ్చి శ్రీనును విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసమే ఆమరణదీక్ష చేస్తున్నామని, మా ప్రాణాలైనా అర్పించడానికి సిద్ధమన్నారు. సీఎం జగన్ మా జిల్లాకు వస్తే ఒకరోజు ముందుగానే తమను హౌస్ అరెస్ట్ చేస్తున్నారని... అందువల్లే దీక్ష చేయతలపెట్టిన ప్రదేశాన్ని ముందుగా తెలియజేయటంలేదన్నారు. శ్రీను తల్లి సావిత్రి మాట్లాడుతూ సీఎం జగన్ కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వకపోవడంతో ఐదేళ్లుగా తన కుమారుడు జైల్లోనే మగ్గుతున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. నా కుమారుడిని విడుదల చేయించి మా కుటుంబాన్ని ఆదుకుంటారని ఆయన్ను కోరుతున్నానన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి జైల్లోనే ఉన్నాడని దాంతో తాము అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. శ్రీను తండ్రి మనోవేదనంతో అనారోగ్యంతో ఉన్నారన్నారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి మా అబ్బాయిని విడుదల చేయించి మాకు తగిన న్యాయం చేయాలని కోరారు. కోడి కత్తి శీను కేసును వాదిస్తున్న హైకోర్టు న్యాయవాది అబ్దుల్ సలీం మాట్లాడుతూ కేసులో ఇప్పటికే 80 శాతం విచారణ పూర్తయిందని, జగన్మోహన్ రెడ్డి కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పితే 90 శాతం పూర్తవుతుందన్నారు.జగన్ మాత్రం ఏడాది నుండి కోర్టుకు రాకుండా వివిధ కారణాలు చూపుతూ రావడం లేదు. ఆయన వచ్చి సాక్ష్యం చెప్తే రెండు నెలల్లో కేసు పూర్తవుతుందన్నారు.ఈ కేసులో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం శిక్ష వేసే అవకాశం ఉండదన్నారు. కానీ విచారణ జరగకుండా జాప్యం చేస్తూ 5ఏళ్లుగా జైలులోనే ఉంచారన్నారు. ఇది పూర్తిగా రాజ్యాంగం విరుద్ధం, చట్ట వ్యతిరేకం కాబట్టి తన క్లయింటును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఎన్నికల వేళ కోడికత్తి శ్రీను నిరాహారదీక్ష చేపట్టడం రాజకీయ చర్చకు దారితీసింది. మరోపక్క దళిత సంఘాలు, పలువురు న్యాయవాదులు కోడి కత్తి శీను నిర్దోషి అని, ఐదేళ్లుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంచడం సరికాదన్నారు. రాజ్యాంగ హక్కులను సీఎం జగన్ కాల రాస్తున్నారని, వెంటనే బెయిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అయోధ్య ప్రాణప్రతిష్ఠపై నిషేధం

అలహాబాద్ హైకోర్టును కోరిన యూపీ వాసి

అలహాబాద్: ఈ నెల 22వ తేదీన అయోధ్యలో నిర్వహించ తలపెట్టిన రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిలిపివేయాలని అలహాబాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన భోలా దాస్ అనే వ్యక్తి ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. శంకరాచార్యులు లేవనెత్తిన అభ్యంతరాలను తన పిల్‌లో పేర్కొన్న భోలా దాస్... అయోధ్య ప్రాణప్రతిష్ఠను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఈ విషయం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరాన్ని జనవరి 22వ తేదీన ప్రారంభించనున్నారని, అయితే హిందూ ఆచారాలు, సనాతన సంప్రదాయం ప్రకారం పుష్య మాసంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. పుష్య మాసంలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు చేపట్టకూడదని తెలిపారు. దీంతోపాటు ప్రస్తుతం అయోధ్య రామమందిర నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని.. ఆలయం ఇప్పటికీ అసంపూర్తిగా ఉందని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆలయంలో ఏ దేవుడినీ ప్రతిష్ఠించకూడదని భోలా దాస్ తన పిటిషన్‌లో తెలిపారు. ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సనాతన సంప్రదాయానికి విరుద్ధంగా జరుగుతోందని చెప్పారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని మరికొన్ని నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ వాడుకుంటోందని పిటిషనర్ ఆరోపించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను అర్ధాంతరంగా నిర్వహిస్తోందని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. అయితే ఇప్పటికే కొంతమంది అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న ఆలయంలో శ్రీరాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన శంకరాచార్యులు ఈ కార్యక్రమానికి హాజరు కాబోమని నలుగురు శంకరాచార్యులు స్పష్టం చేశారు. దేశంలోని ప్రముఖ శంకరాచార్యులు అయిన ఉత్తరాఖండ్ జ్యోతిష్య పీఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి.. పూరీ గోవర్ధన్ పీఠం శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి, శృంగేరి పీఠాధిపతి స్వామి భారతీ కృష్ణాజీ, ద్వారకా పీఠాధిపతి స్వామి సదానంద్ మహారాజ్ ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ సహా ఇండియా కూటమిలోని అనేక పార్టీలు ఇప్పటికే ఈ అయోధ్య ప్రారంభోత్సవం సందర్భంగా వచ్చిన ఆహ్వానాలను తిరస్కరించాయి. రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీజేపీ, నరేంద్ర మోదీ... తమ వ్యక్తిగత కార్యక్రమంగా భావిస్తున్నట్లు ఆరోపించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే హడావుడిగా నిర్మాణంలో ఉన్న అయోధ్య రామాలయాన్ని ప్రారంభిస్తున్నారని విమర్శలు గుప్పించాయి.

సంక్రాంతి సెలవులు... మూడు రోజులు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సెలవులను మరో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ బుధవారం తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో ఈనెల 18 వరకు పాఠశాలలకు సెలవులు ఇవ్వగా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కోరిక మేరకు మరో మూడు రోజులు సెలవులు పొడిగిస్తూ 22న పాఠశాలలు తెరుస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేర్కొన్నారు.

20న కార్మిక సంఘాల రాస్తారోకో

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్‌వాడీ కార్మికులకు మద్దతుగా శనివారం అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు నిర్వహించాలని కార్మిక సంఘాలకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ,సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీల సమావేశం బుధవారం జరిగింది. అంగన్‌వాడీలకు మద్దతుగా సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు జయప్రదం చేయాలని ఓబులేసు అన్నారు. ఇతర కార్మిక, ప్రజా సంఘాల భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమం జయప్రదానికి గురువారం ఏఐటీయూసీ, సీఐటీయూ. ఐఎఫ్‌టీయూ సంఘాల జిల్లా నాయకత్వం సమావేశమై కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నిరవధిక దీక్షలను రాష్ట్ర ప్రభుత్వం భగ్నం చేస్తే... మరుసటి రోజే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలపాలని ఓబులేసు పిలుపునిచ్చారు.

86 శాతం తగ్గిన కెనడా వెళ్లే భారత విద్యార్థులు

ఒట్టావా: ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి భారత్, కెనడా మధ్య వివాదం తలెత్తిన నేపథ్యంలో కెనడాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన విభేదాలు నెలకొనడంతో భారతీయ విద్యార్థులకు ఇచ్చే స్టడీ పర్మిట్ల సంఖ్యను ఆ దేశం భారీగా తగ్గించింది. దీంతో 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కేవలం 14,910 పర్మిట్లు మాత్రమే జారీ చేసింది. అంతకుముందు త్రైమాసికంలో అంటే జులై నుంచి సెప్టెంబర్ మధ్య 3 నెలల వ్యవధిలో భారతీయులకు కెనడా జారీ చేసిన స్టడీ పర్మిట్ల సంఖ్య 1,08,940గా ఉంది. అంటే గత త్రైమాసికంలో ఈ స్టడీ పర్మిట్ల సంఖ్య దాదాపు 86 శాతం తగ్గుదల నమోదైంది. భారత్, కెనడా దౌత్య వివాదం కారణంగా భారత్‌లోని రాయబారులను తగ్గించుకుని వెనక్కి రప్పించుకోవాలని కేంద్రం ఆ దేశానికి సూచించింది. దీంతో భారత్ విధించిన గడువు కంటే ముందే 41 మంది దౌత్యాధికారులను కెనడా వెనక్కి తీసుకుంది. భారత్‌లో దౌత్య అధికారులు భారీగా తగ్గిపోవడంతో ఎక్కువ స్టడీ పర్మిట్లను పరిశీలించడం కుదరడం లేదని కెనడా ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అయితే ఈ పరిస్థితిలో ఇప్పుడే ఎలాంటి మార్పు కనిపించే అవకాశాలు లేవని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా కెనడాకు వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపించడం లేదు. కెనడాలో చదువుకునే విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అధికం. 2022లో అన్ని దేశాలకు కలిపి కెనడా 2,25,835 స్టడీ పర్మిట్లు జారీ చేయగా...అందులో 41 శాతం స్టడీ పర్మిట్లను భారతీయ విద్యార్థులే దక్కించుకున్నారు. మరోవైపు, కెనడాలోని యూనివర్సిటీలకు విదేశీ విద్యార్థులే ప్రధాన ఆదాయ వనరు కాగా... అందులో భారతీయులే అధికంగా ఉంటారు. మరోవైపు విదేశీ విద్యార్థుల వలసలు గణనీయంగా పెరిగాయని, దీంతో కెనడాలో నిరుద్యోగం, ఇళ్ల కొరత సమస్యలు తలెత్తుతున్నాయని ఇటీవల మార్క్ మిల్లర్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే తమ దేశంలో నివసిస్తున్న విదేశీ విద్యార్థులపై పరిమితి విధించే యోచనలో ఉన్నామని చెప్పారు.

సిద్దరామయ్య సీఎంగా కొనసాగాలంటే కాంగ్రెస్ మెరుగుపడాలి : యతీంద్ర

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య ఐదేళ్ల పాటు అధికారంలో ఉండాలంటే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రదర్శన మెరుగ్గా ఉంటేనే సాధ్యమని సిద్దరామయ్య తనయుడు యతీంద్ర అన్నారు. యతీంద్ర బుధవారం హసన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 'అన్ని వర్గాల సంక్షేమం కోసం సిద్దరామయ్య ప్రభుత్వం గ్యారెంటీలు అమలు చేస్తోంది. ప్రభుత్వానికి ప్రజల మద్దతున్నది. లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలు తమ మద్దతును చాటిచెప్పాలి. మరిన్ని ఎక్కువ స్థానాల్లో గెలిపించాలి. అప్పుడు అడ్డంకులు లేకుండా సిద్దరామయ్య ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగగలరు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీలూ కొనసాగుతాయి' అని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత సీఎం పదవి కోసం సిద్దరామయ్య, డీకే శివకుమార్ పోటీ పడిన విషయం తెలిసిందే. తీవ్ర ఉత్కంఠ తర్వాత సిద్దరామయ్యకు సీఎం, డీకేకు డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టారు. వీరిద్దరూ పదవీకాలాన్ని పంచుకునే అవకాశముందని అప్పట్లో వార్తలు వచ్చాయి. తొలి రెండున్నరేళ్ల పాటు సిద్దు, ఆ తర్వాత డీకే సీఎం బాధ్యతలు చేపట్టేలా ఒప్పందం కుదిరినట్లు ఊహాగానాలు వినిపించాయి. వీటిని కాంగ్రెస్ అధిష్ఠానం సమర్థించలేదు. అలాగనీ ఖండించలేదు. ఈ క్రమంలోనే యతీంద్ర తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఉద్ధవ్ వర్గం ఫిర్యాదుపై 22 సుప్రీంలో విచారణ

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన అని అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన అదేశాలను సవాల్ చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వర్గం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యవహారాన్ని 22వ తేదీన విచారిస్తామని సర్వోన్నత న్యాయస్థానం బుధవారం తెలిపింది. వాస్తవానికి సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం ఈ కేసును శుక్రవారం విచారించాల్సి ఉంది. అయితే విచారణను వచ్చే వారిని వాయిదా వేయాలని ఠాక్రే తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ న్యాయస్థానాన్ని కోరారు. దీంతో వచ్చే సోమవారం అంటే 22వ తేదీన కేసును విచారిస్తామని సీజేఐ తెలిపారు. ఈనెల 15న ఠాక్రే వర్గం న్యాయవాది రోహిత్ శర్మ ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. స్పీకర్ ఈనెల 10న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసింది. ఇదిలావుంటే, ఉద్ధవ్ వర్గానికి చెందిన 14 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ రాహుల్ నార్వేకర్ అనర్హత వేటు వేయకుండా నిర్ణయం తీసుకోవడాన్ని షిండేవర్గం తాజాగా బాంబే హైకోర్టుకు వెళ్లింది. షిండే నేతృత్వ శివసేన చీఫ్‌విప్ భరత్‌షెట్ గోగావాలే పిటిషన్ దాఖలు చేశారు. జనవరి 12న శివసేన ఇరు వర్గాల అనర్హత పిటిషన్లను స్పీకర్ తిరస్కరించారు. షిండే వర్గమే అసలైన శివసేనగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ వర్గం ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయకపోవడాన్ని షిండే వర్గం ప్రశ్నించింది. స్పీకర్ ఆదేశం లోపభూయిష్టంగా ఉందని ఆరోపించింది. వాటి రద్దునకు డిమాండ్ చేసింది. ఉద్ధవ్ వర్గ 14 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని బాంబే హైకోర్టును కోరింది. న్యాయమూర్తులు గిరీష్ కులకర్ణి, ఫిర్దోష్ పూనివాలాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్ పరిశీలించింది. ప్రతివాదులైన స్పీకర్, ఉద్ధవ్ వర్గం శివసేన ఎమ్మెల్యేలు కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 8కు వాయిదా వేసింది.

అదానీ చేతికి ఐఏఎన్ఎస్ న్యూస్ ఏజెన్సీ

న్యూఢిల్లీ: ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ తన మీడియా వ్యాపారాన్ని మరింత విస్తరిస్తున్నారు. ప్రముఖ న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసిన అదానీ గ్రూప్... తాజాగా దాన్ని మరింత పెంచుకుని మీడియా సంస్థపై పూర్తి నియంత్రణ సాధించింది. ఈ విషయాన్ని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. అదానీ గ్రూప్‌నకు చెందిన ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ లిమిటెడ్ ద్వారా ఇటీవల ఐఏఎన్ఎస్‌లో 50.50శాతం వాటా కొనుగోలు చేశారు. ఇప్పుడు దాన్ని ఓటింగ్ హక్కులతో 76 శాతం, ఓటింగ్ హక్కులు లేకుండా 99.26 శాతానికి పెంచుకున్నారు. ఇందుకు రూ.5 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు కంపెనీ తెలిపింది. జనవరి 16న జరిగిన న్యూస్ ఏజెన్సీ బోర్డు సమావేశంలో ఈ వాటాల పెంపునకు ఆమోదం లభించింది. ఐఏఎన్ఎస్ ఇకపై ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ అనుబంధ సంస్థగా పనిచేస్తుందని అదానీ గ్రూప్ వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఐఏఎన్ఎస్ ఆదాయం రూ.11.86 కోట్లుగా ఉంది. గతేడాది మార్చిలో బిజినెస్, ఫైనాన్షియల్ న్యూస్ అందించే క్వింటిలియన్ బిజినెస్ మీడియా కొనుగోలుతో మీడియా రంగంలోకి అడుగుపెట్టిన అదానీ... అదే ఏడాది డిసెంబర్‌లో ఎన్డీటీవీలో 65 శాతం వాటా చేజిక్కించుకున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.